శనివారం
12-08-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 52
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

50 ఏళ్లలో రష్యా తొలి మూన్ మిషన్

రష్యా చరిత్రాత్మక మిషన్‌ను శుక్రవారం చేపట్టింది. 50ఏళ్ల తర్వాత చంద్రుడిపైకి 'లూనా-25'ను విజయవంతంగా ప్రయోగించింది. చంద్రుడి దక్షిణ ధ్రువంపై పరిశోధనల కోసం ఈ ప్రయోగాన్ని చేపట్టినట్లు రష్యా అంతరిక్ష పరిశోధనా కేంద్రం (రోస్‌కాస్మోస్) ప్రకటించింది.

2 లో

ఈసీ స్వతంత్రతను కాపాడాలి

హరియాణాలో సామాజిక విభజన ఆపాలి: సీపీఐ

న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ నియామకానికి సంబంధించిన సెలక్షన్ కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తి స్థానాన్ని కేబినెట్ కార్యదర్శితో భర్తీ చేయడాన్ని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఖండించింది. కేంద్రప్రభుత్వ చర్యను దుయ్యబడుతూ శుక్రవారం సీపీఐ కార్యదర్శివర్గం ఓ ప్రకటన చేసింది.

ఎన్నికల కమిషన్‌ని ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేయనివ్వాలని కేంద్రాన్ని కోరింది. రాజ్యాంగం హామీనిచ్చిన స్వావలంభనపై దాడులు మానుకోవాలని హితవు పలికింది. హరియాణాలో మతం పేరిట సమాజాన్ని విభజించడాన్ని, మతోన్మాదాన్ని నూరిపోయడాన్ని ఆపేయాలని వేరొక ప్రకటనలో డిమాండ్ చేసింది. ముస్లిం దుకాణదారులు, విక్రేతలను వ్యాపారాలు చేసుకోనివ్వకుండా నిషేధం విధిస్తూ హరియాణాలోని అనేక గ్రామ పంచాయతీలు తీర్మానాలు చేయడంపై సీపీఐ కార్యదర్శివర్గం తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. ఇది సామాజిక బహిష్కరణ కాక మరేమిటని ప్రశ్నించింది. మతం పేరిట సమాజాన్ని విభజించడాన్ని, మతఘర్షణలను రెచ్చగొట్టడాన్ని ఆపేయాలని డిమాండ్ చేసింది. సంఘ విద్రోహ శక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని హరియాణా ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితుల్లో రాష్ట్రంలోని మైనారిటీలకు అండగా నిలుస్తూ వారికి మద్దతును హరియాణా ప్రభుత్వం అందిస్తుందని ఆశిస్తున్నట్లు సీపీఐ తెలిపింది.

నేరస్మృతులకు
కొత్త తొడుగు

- రాజద్రోహం స్థానే దేశద్రోహం
- మూకహత్యలకు మరణదండన
- మారనున్న ఐపీసీ, సీఆర్పీసీ, ఆధారాల చట్టాలు
- లోక్‌సభలో మూడు కొత్త బిల్లులు ప్రవేశపెట్టిన అమిత్‌షా

న్యూఢిల్లీ: నేరస్మృతులకు కొత్త తొడుగునకు మోదీ సర్కార్ శ్రీకారం చుట్టింది. వలసవాద కాలం నాటి చట్టాలకు స్వస్తి పలికే నెపంతో కొత్త సీసాలో పాత సారా చందంగా రూపం మార్చిన చట్టాలను లోక్‌సభలో ప్రవేశపెట్టింది. రాజద్రోహం చట్టం ఇక దేశద్రోహంగా మారింది. బ్రిటిష్ కాలం నాటి రాజద్రోహం చట్టాన్ని పూర్తిగా రద్దు చేస్తున్నట్లు చెబుతూనే కొత్తగా తెచ్చిన చట్టం ప్రకారం దేశానికి వ్యతిరేకంగా మాట్లాడినా, రాతలు రాసినా, గుర్తులు ప్రదర్శించినా, ఎలక్ట్రానిక్ మాధ్యమాల ద్వారా ఏదేని ప్రచారం చేసినాగానీ యావజ్జీవ శిక్ష విధించేలా ప్రతిపాదనలు చేసింది. తిరుగుబాటులు, యుద్ధం తరహా నేరాలకు జీవతఖైదు విధించేలా చట్టాలను రూపొందించింది. సామూహిక అత్యాచారాల్లో నిందితులకు 20ఏళ్ల జైలు లేదా జీవితఖైదు, మైనర్లపై జరిగే అత్యాచార కేసుల్లో నేరం రుజువైతే మరణశిక్ష, మూక దాడులకు ఏడేళ్ల జైలు... తీవ్రతను బట్టి జీవిత ఖైదు, మరణశిక్ష విధించే అవకాశం ఉంటుంది. అలాగే చిన్నారులపై దాడులకు పాల్పడితే పదేళ్ల జైలు శిక్ష పడుతుంది. లైంగిక హింస సంబంధిత కేసుల్లో బాధితుల వాంగ్మూలం, వీడియో రికార్డింగ్ తప్పనిసరి వంటి ప్రతిపాదనలతో కొత్తగా మూడు బిల్లులను హోంమంత్రి అమిత్‌షా లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ప్రతిపాదిత చట్టాలతో దేశ నేర న్యాయ వ్యవస్థ కొత్త రూపాన్ని సంతరించుకోనున్నట్లు తెలిపారు. దేశద్రోహం చట్టం రద్దు, మైనర్లపై అత్యాచారాలకు, మూక హత్యల వంటి నేరాల్లో దోషులకు గరిష్ఠంగా మరణశిక్ష విధించేలా ప్రతిపాదనలతో బిల్లులను తెచ్చామన్నారు. ప్రజాస్వామ్య దేశంలో స్వేచ్ఛగా మాట్లాడే హక్కు ప్రతిఒక్కరికీ ఉంటుందని అన్నారు. సాయుధ తిరుగుబాటు, విధ్వంస చర్యలు, వేర్పాటువాద కార్యకలాపాలు, దేశ సార్వభౌమత్వానికి ముప్పు వంటి చర్యలను నేరాలుగా పరిగణిస్తూ కొత్త చట్టాల్లో ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. సత్వరమే న్యాయం అందించడం, తీర్పుల రేటును 90శాతానికి తీసుకెళ్లడమే ఈ చట్టాల లక్ష్యమని అమిత్‌షా చెప్పారు.

భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) బిల్లు, 2023, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్) బిల్లు, 2023; భారతీయ సాక్ష్య (బీఎస్) బిల్లు, 2023ను ప్రతిపాదించారు. భారతీయ శిక్షా స్మృతి (ఐసీసీ) 1860, క్రిమినల్ ప్రొసీజర్ యాక్ట్ 1898, ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ (ఆధారాల చట్టం) 1982 స్థానాన్ని ప్రతిపాదిత చట్టాలు భర్తీ చేస్తాయని అమిత్‌షా తెలిపారు. వేగవంతమైన న్యాయం అందించేందుకు, దేశ ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణమైన న్యాయ వ్యవస్థ ఉండాలనే ఈ ప్రతిపాదనలని చెప్పారు. దేశద్రోహం చట్టాన్ని రద్దు చేయడానికి, మైనర్లపై అత్యాచారాలు, మూక హత్యల దోషులకు మరణశిక్ష విధించేలా బీఎన్ఎస్ బిల్లులో నిబంధనలు ఉన్నాయని చెప్పారు. చిన్న నేరాలకు సంబంధించిన శిక్షల్లో మొదటిసారి సంఘ సేవ చేయించే ప్రతిపాదన ఉందన్నారు. సాయుధ తిరుగుబాటు, విధ్వంస చర్యలు, వేర్పాటువాద కార్యకలాపాలు, దేశ సార్వభౌమత్వానికి ముప్పు కలిగించే నేరాలకు సంబంధించి కొత్త చట్టాల్లో ప్రతిపాదనలు పొందుపర్చారు. పోలీసులు తమ అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. నిందితులు పరారీలో ఉన్నా వారిపై విచారణ

- మిగతా 2 లో

విధుల భారం

- గ్రామ సచివాలయాలకు ఆర్టీఐ
- డిజిటల్ అసిస్టెంట్లకు అదనపు బాధ్యత
- కొత్త ఉద్యోగాలేవి?
- పని ఒత్తిడితో సిబ్బంది సతమతం
- ఖాళీల భర్తీలో జాప్యం

విశాలాంధ్రబ్యూరో-అమరావతి: గ్రామ సచివాలయాలల్లోని డిజిటల్ అసిస్టెంట్ సిబ్బందిపై జగన్ ప్రభుత్వం అదనపు విధుల భారం మోపుతోంది. సచివాలయాల్లో సమాచార హక్కు చట్టం తీసుకొచ్చి, వాటికి అవసరమైన సిబ్బందిని నియమించకుండా ఉన్న వారికే బాధ్యతలు అప్పగించడం నిరుద్యోగులకు నిరాశను మిగుల్చుతోంది. అటు ఉన్న ఉద్యోగుల పైన పని భారం పడుతోంది. సమాచార హక్కు చట్టం అమలు కోసం ప్రతి సచివాలయానికి ఒకరు లేదా ఇద్దరు సిబ్బందిని నియమిస్తే తమకు ఉద్యోగవకాశాలు లభించేవని నిరుద్యోగులు వాపోతున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో పారదర్శకత తీసుకొచ్చేందుకుగాను తాజాగా గ్రామ సచివాలయాల్లోనూ సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) వ్యవస్థ ఏర్పాటుకు జగన్ సర్కార్ సిద్ధమైంది. ఈ మేరకు అన్ని గ్రామ సచివాలయాల్లో సమాచార హక్కు చట్టం అధికారుల నియామకానికి పంచాయతీరాజ్,

- మిగతా 2 లో

వాయిదాలు, నిరసనలు, సస్పెన్షన్లు

- ఆఖరిరోజు ఆగని నినాదాలు - సాగని చర్చలు
- స్పీకర్ ప్రసంగాన్ని బహిష్కరించిన ప్రతిపక్షాలు
- మణిపూర్‌పై రాజ్యసభ రసాభాస
- పార్లమెంటు నిరవధిక వాయిదా

న్యూఢిల్లీ: అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాడీవేడి చర్చలు, మణిపూర్‌లో విమర్శలు, ప్రతివిమర్శలు, అవిశ్వాస తీర్మానంపై పరస్పరం దాడులతో పార్లమెంటు ఉభయ సభలు దద్దరిల్లిపోయాయి. ప్రారంభం నుంచి ముగింపు వరకు చట్టసభల్లో సీన్ మారలేదు. వరుస వాయిదాలు, విపక్షాల నిరసనలు, వాకౌట్‌లు, ఏకపక్షంగా బిల్లుల ఆమోదం కొనసాగింది. సభ్యుల సస్పెన్షన్‌లు, అవిశ్వాసంపై చర్చతోనే సభా కాలం సగానికిపైగా గడిచిపోయింది. మణిపూర్ పరిస్థితిపై ప్రధాని ప్రకటన, ఆపై చర్చ కోసం విపక్షాలు చివరి వరకు డిమాండ్ చేశాయి. కానీ పట్టువిడవని ప్రభుత్వ తీరుతో ఉభయ సభలు శుక్రవారం కూడా రసాభాస అయ్యాయి. ఇండియా కూటమి సభ్యులు ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, అల్లర్లు, హింసాకాండ, వివక్ష, మహిళలపై ఆకృత్యాలు తదితర అంశాలను లేవనెత్తారు. మణిపూర్, హరియాణాలో పరిస్థితులపై ప్రభుత్వాన్ని నిలదీశారు. మణిపూర్‌పై కాలపరిమితి లేకుండా చర్చ జరపాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం వెల్‌లోకి వెళ్లి నిరసనలు తెలిపారు కానీ ఫలితం లేకపోయింది. తాము చెప్పిందే వేదమన్నట్లు అధికార పక్షం నడుచుకుంది. చివరివరకు పట్టుదలగానే ఉంది. దీంతో మణిపూర్ అంశమై తీర్మానం జరగలేదు. మణిపూర్ ప్రజలకు న్యాయం జరగలేదు. చివరి రోజు కూడా ఇదే అంశమై ఎగువ సభలో వాయిదాల పరంపర కొనసాగింది. ప్రజా సమస్యలపై చర్చకు అక్కరకు రాకపోవడం, అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపక్షాలు ప్రవేశపెట్టిన ఉద్దేశం నెరవేరకుండానే పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు తెరపడింది. ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి.

లోక్‌సభలో కాంగ్రెస్ నేత గౌరవ్ గొగోయ్

- మిగతా 2 లో

విశాఖ ఉక్కును నష్టాల బూచి చూపి ప్రైవేట్‌పరం చేస్తూ కార్పొరేట్ దిగ్గజాలకు ఎర్ర తివాచీ పరిచిన ప్రధాని మోదీ ఏపీలో మరో ఉక్కు పరిశ్రమకు అనుమతి ఇస్తారని, ఎదుగుదలకు సహకరిస్తారని ఆశించడం వెర్రితనమే అవుతుంది. ఆయన నాలుగేళ్లుగా నాన్చి సాంకేతికంగా లాభసాటి కాదన్న సాకుచూపి కడప ఉక్కుకు చెక్ చెప్పడంలో అంతర్యం కార్పొరేట్ల వ్యాపారానికి ఎదురు లేకుండా చేయడమే.

కార్పొరేట్లకు రెడ్ కార్పెట్...
కడప ఉక్కుకు స్వస్తి

- లోక్‌సభలో కేంద్ర మంత్రి ప్రకటన సుస్పష్టం
- సాంకేతిక సమస్యలు ఓ బూచి
- 'ప్రైవేట్' జపంతో పుంజుకునేనా?

2 లో

ప్రధాని ఇలాగేనా మాట్లాడేది? : రాహుల్ 8 లో

ఇదీ లోకం!

విద్వేష ప్రసంగాలు
ఆమోదయోగ్యం కాదు

- వర్గాల మధ్య సఖ్యత, సామరస్యత అవశ్యం
- అణచివేత సందేశాన్ని పంపడానికే లైంగిక దాడులు
- వాటి నివారణ బాధ్యత రాష్ట్రాలదే
- మణిపూర్, హరియాణాలో హింసపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: అన్ని వర్గాల మధ్య సఖ్యత, సామరస్యత, మర్యాదపూర్వక వైఖరి ఉండాలని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. విద్వేష ప్రసంగాలతో ఎవరికి మంచి జరగబోదని తెలిపింది. మణిపూర్, హరియాణా వంటి రాష్ట్రాల్లో అల్లర్లు, వర్గపోరును ప్రస్తావించింది. ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకొని దాడులు చేయడం, సామాజికంగా, ఆర్థికంగా బహిష్కరించడం, హత్యలకు పాల్పడటం, విద్వేష ప్రసంగాలతో రెచ్చగొట్టడం వంటి అంశాలకు సంబంధించి దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు శుక్రవారం విచారించింది. అల్లర్ల క్రమంలో అల్లరిమూకలు ఎదుటి వర్గాలకు అణచివేత సందేశాన్ని పంపేందుకు లైంగిక హింసను వాడతారని, మహిళలపై హేయమైన నేరాలకు పాల్పడటం వంటివి నివారించడం సంబంధిత రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతని న్యాయస్థానం తేల్చిచెప్పింది. మణిపూర్‌లో హింస బాధితుల పునరావాసం, పరిహారం చెల్లింపు, కూల్చిన గృహాలు, ప్రార్థనా మందిరాల పునరుద్ధరణతో పాటు మే 4న తర్వాత మహిళలపై లైంగిక దాడుల స్వభావంపైనా విచారణ జరపాలని ముగ్గురు మహిళా మాజీ న్యాయమూర్తులతో ఏర్పాటు చేసిన కమిటీని సుప్రీం కోర్టు ఆదేశించింది. 'మహిళలపై లైంగిక నేరాలు,

- మిగతా 2 లో

107, 108 జీవోలను
రద్దు చేయాలి

- రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన సంఘాలు గళం విప్పాలి
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- ఈ నెల 16 నుంచి పోస్టు కార్డుల ఉద్యమం : ఏఐఎస్ఎఫ్
- గవర్నర్‌ను కలిసి వినతి పత్రం సమర్పిస్తామని వెల్లడి

2 లో

భారత్ జుట్టు
భేష్!

- ప్రపంచదేశాల్లో మంచి గిరాకీ
- గత ఐదేళ్లలో 370 మిలియన్ డాలర్ల జుట్టు ఎగుమతి

భారతీయుల జుట్టుకు ప్రపంచ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఈ విషయం పార్లమెంటు సాక్షిగా బట్టబయలైంది.

2 లో

50 ఏళ్లలో రష్యా తొలి మూన్ మిషన్

'లునా-25' ప్రయోగం విజయవంతం

వ్లాడివోస్టోక్: రష్యా చరిత్రాత్మక మిషన్‌ను శుక్రవారం చేపట్టింది. 50ఏళ్ల తర్వాత చంద్రుడిపైకి 'లునా-25'ను విజయవంతంగా ప్రయోగించింది. చంద్రుడి దక్షిణ ధ్రువంపై పరిశోధనల కోసం ఈ ప్రయోగాన్ని చేపట్టినట్లు రష్యా అంతరిక్ష పరిశోధనా కేంద్రం (రోస్‌కాస్మోస్) ప్రకటించింది. తూర్పు రష్యాలో అమూర్ ఓబ్లాస్‌లోని వోస్టోచ్నీ కాస్మోడ్రోమ్ నుంచి ఫ్రెగెట్ అప్పర్ స్టేజ్ నుంచి సోయుజ్-2.1బీ రాకెట్ ద్వారా 'లునా-25' నింగిలోకి దూసుకెళ్లిందని తెలిపింది. ప్రయోగించిన తొమ్మిది నిమిషాల్లో రాకెట్ మూడవ దశ పూర్తి అయి లూనా-25 వేరు పడిందని, గంట తర్వాత చంద్రుడి వైపునకు ప్రయాణం ప్రారంభించిందని, మిషన్ తొలిదశ విజయవంతమైందని వెల్లడించింది. ఈ మిషన్‌లో మొత్తం నాలుగు దశలు ఉంటాయి. రెండవ దశలో భాగంగా ఐదు రోజుల్లోనే లూనా-25 చంద్రుడి కక్ష్యలోకి చేరనుంది. మూడవ దశలో లూనా -25 చంద్రుడి చుట్టూ మూడు రోజుల పాటు తిరుగుతుంది. నాల్గో దశలో చంద్రుడిపై దిగుతుంది. అన్ని అనుకూలంగా జరిగితే ఈనెల 21న ల్యాండర్ చంద్రుడిపై దిగుతుందని రష్యా అకాడమీ ఆఫ్ సైన్సెస్ తెలిపింది. 1976 తర్వాత రష్యా చేపట్టిన తొలి లూనార్ ల్యాండర్ ప్రయోగం ఇదే కాగా చంద్రుడి దక్షిణ ధ్రువంపై దిగే మొదటి స్టేషన్‌గా లూనా-25 చరిత్రలో నిలిచిపోనుంది.

నైగర్‌లో జుంటా కొత్త ప్రభుత్వ ఏర్పాటు

కేబినెట్ మంత్రుల నియామకం

నియామే: నైగర్‌లో సైనిక జుంటా కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది. ప్రధాని అలీ మహామన్ లమినే జైనే నేతృత్వ మంత్రిమండలిలో 21 మంత్రులు నియమితులయ్యారు. ఈ మేరకు జుంటా అధికారికంగా ప్రకటించింది. కేబినెట్ మంత్రుల నియామకాదేశాలపై నేషనల్ కౌన్సిల్ ఫర్ ది సేఫ్‌గార్డింగ్ ఆఫ్ ది హోంల్యాండ్ (సీఎన్ఎస్పీ) అధ్యక్షుడు బ్రిగేడియర్ జనరల్ అబ్దురెహమానే టియానీ సంతకం చేశారు. కేబినెట్ మంత్రుల్లో ఆరుగురు సైన్యాధికారులు ఉన్నారు. ఆర్థిక శాఖ బాధ్యతలనూ ప్రధానియే చేపడతారు. సీఎన్ఎస్పీ జనరల్స్‌కు రక్షణ, అంతర్గత వ్యవహారాలు, క్రీడా, ఆరోగ్య, రవాణా, పారిశుద్ధ్యం, పర్యావరణ శాఖలను అప్పగించారు. నైగర్ తిరుగుబాటు నేతలకు ప్రజాస్వామిక పరిపాలన పునరుద్ధరణకు విధించిన డెడ్‌లైన్ గత ఆదివారమే ముగిసింది. దీంతో సైనిక జోక్యం తప్పబోదని ఈసీఓడబ్ల్యూఏఎస్ హెచ్చరించింది. కానీ జుంటా పెద్దగా పట్టించుకోలేదు. ఈ సమస్యకు చర్చల ద్వారా శాంతియుత పరిష్కారం అవసరమని నైజీరియా అధ్యక్షుడు బొలా టినుబు నొక్కిచెప్పారు. కాగా, ఎకనమిక్ కమ్యూనిటీ ఆఫ్ వెస్ట్ ఆఫ్రికన్ స్టేట్స్ (ఈసీఓడబ్ల్యూఏఎస్) నాయకులు గురువారం నైజీరియా రాజధాని అబుజాలో అసాధారణ సమావేశాన్ని నిర్వహించి నైగర్‌లో సైనిక తిరుగుబాటుకు ప్రతిస్పందనపై నిశితంగా చర్చించారు. తదుపరి కార్యాచరణపై సమాలోచనలు జరిగినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.

మెరుగైన జీతం, హక్కులు, గుర్తింపు కావాలి

పోర్చుగల్‌లో నర్సుల సమ్మె

లిస్బన్: తమకు మెరుగైన వేతనాలు ఇవ్వాలని, హక్కులు కల్పించాలని డిమాండ్ చేస్తూ పోర్చుగల్‌లోని నర్సులు సమ్మెబాట పట్టారు. ప్రభుత్వ-ప్రైవేటు రంగంలో వేతనాలు, పనిగంటల వ్యత్యాసాన్ని ప్రధానంగా పేర్కొంటూ మెరుగైన పని పరిస్థితులను డిమాండ్ చేశారు. పదేళ్లలో పురోగతి సాధించిన ప్రైవేటు రంగంలో జీతాలు ఎక్కువ, పని గంటలు తక్కువగా ఉంటే ప్రభుత్వ రంగంలో పని ఎక్కువ, జీతం తక్కువగా ఉన్నదని నిరసనకారులు తెలిపారు. సెలవు రోజుల్లో పనిచేస్తే వచ్చేది కూడా ప్రభుత్వ రంగంలో అరకొరగానే ఉండటంపై అసంతృప్తి వ్యక్తంచేశారు. వీధుల్లోకి వచ్చి తమ హక్కుల కోసం డిమాండ్ చేశారు. మెరుగైన పని పరిస్థితుల కోసం నర్సులు వీధుల్లోకి రావాల్సి వచ్చిందని పోర్చుగీస్ నర్సుల సమాఖ్య అధ్యక్షుడు మాసెడో అన్నారు. ప్రైవేటు రంగంలో వారానికి 35 గంటల పని కాగా ప్రభుత్వ రంగంలో వారానికి 40 గంటలు పనిచేయాల్సి వస్తోందని నిరసనకారులు తెలిపారు. వీకెండ్‌లో, ప్రభుత్వ సెలవుదినాల్లో చేసే పనికి ప్రైవేటు రంగంలోని నర్సులకు మెరుగైన ప్రోత్సకాలు అందుతున్నట్లు వెల్లడించారు. దీర్ఘకాలంగా పోర్చుగల్ నర్సుల సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని మాసెడో అన్నారు. పోర్చుగల్‌లో 80వేల మంది రిజిస్టర్డ్ నర్సులు ఉన్నట్లు చెప్పారు. ఆరోగ్య రంగానికి సంబంధించిన విధానాలను రూపొందించే సమయంలో నర్సుల గురించి ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. ఎప్పుడు 'డబ్బు, నిర్వహణ, వైద్యుల గురించే ఆలోచిస్తారు. నర్సుల గురించి వారి అవసరాలు, వెతల గురించి పట్టించుకోరు. కాబట్టి వారు తమ డిమాండ్ల పరిష్కారానికి పోరాడాల్సి వచ్చిందని ఆయనన్నారు.

భారత్ జుట్టు భేష్ !

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : భారతీయుల జుట్టుకు ప్రపంచ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఈ విషయం పార్లమెంటు సాక్షిగా బట్టబయలైంది. మన జుట్టుకు విదేశాల్లో విపరీతమైన గిరాకీ ఉండడంతో గడిచిన 5 సంవత్సరాల్లో భారతదేశం నుంచి దాదాపు 370 మిలియన్ అమెరికన్ డాలర్ల విలువైన మానవ జుట్టు ఇతర దేశాలకు ఎగుమతి అయింది. ఈ ఎగుమతులు కూడా ప్రతి ఏటా గణనీయంగా పెరగడం మరో విశేషం. రాజ్యసభలో శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన సభ్యులు విజయసాయి రెడ్డి ఈ అంశంపై అడిగిన ప్రశ్నకు మంత్రి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ సభకు వివరాలు అందించారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో 34.46 మిలియన్ డాలర్ల విలువైన మానవ జుట్టును ఎగుమతి చేయగా, 2019-20లో 5.70 మిలియన్ డాలర్లు, 2020-21లో 11.65 మిలియన్ డాలర్లు, 2021-22 లో 149.07 డాలర్లు, 2022-23లో అత్యధికంగా 169.23 మిలియన్ డాలర్లు విలువచేసే జుట్టు ఎగుమతి చేసినట్లు తెలిపారు. కరోనా లాక్‌డౌన్ కారణాలతో 20,21 సంవత్సరాల్లో ఎగుమతులు తగ్గాయి.

మానవ జుట్టు, జుట్టు ఉత్పత్తుల అసోసియేషన్, ఫ్లెక్స్ కౌన్సిల్ అందించిన సమాచారం ప్రకారం ప్రపంచంలో అత్యధికంగా జుట్టు (ముడి సరుకు) లభించేది భారతదేశంలోనే అని అన్నారు. అలాగే భారత్ లో లభించే జుట్టు అత్యంత నాణ్యమైనదిగా ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిందని వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ వాణిజ్య ప్రదర్శనలకు హాజరయ్యేందుకు సంబంధిత పరిశ్రమలతో కలిసి ఫ్లెక్స్ కౌన్సిల్ చురుకుగా పనిచేస్తోందని, జుట్టుతో విగ్గులు వంటి విలువైన వస్తువులు ఉత్పత్తి చేసేందుకు ఎగుమతిదారులకు శిక్షణ ఇచ్చేలా ప్రభుత్వంతో కలిసి పనిచేస్తోందని మంత్రి తెలిపారు. ఇటీవల ఫ్లెక్స్ కౌన్సిల్ నిర్వహించిన అతిపెద్ద బ్యూటీ షో "కాస్మోప్రోఫ్ వరల్డ్‌వైడ్ బోలోగ్నా 2023"లో ఇండియా నుంచి జుట్టు ఉత్పాదనలు చేసే పరిశ్రమలకు చెందిన 20 మంది ప్రదర్శనకారులు పాల్గొన్నారని తెలిపారు. ఈ ప్రదర్శనలో ఇండియన్ పెవిలియన్‌ను సందర్శించిన ప్రపంచదేశాల కొనుగోలుదారుల నుంచి సానుకూల స్పందన లభించిందన్నారు. 2024లో నిర్వహించనున్న ప్రదర్శనలో ఫ్లెక్స్ కౌన్సిల్ ఇదే స్ఫూర్తితో పాల్గొంటుందని మంత్రి తెలియజేశారు. ఇండియా నుంచి అరుణాచల్ ప్రదేశ్ మీదుగా మయన్మార్ ద్వారా చైనాకు భారతీయ జుట్టు అక్రమ రవాణా జరుగుతుందనడానికి ఎటువంటి ఆధారాలు లేవని, కస్టమ్స్ శాఖ వద్ద ఎటువంటి కేసులూ నమోదు కాలేదని మంత్రి మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

107, 108 జీవోలను రద్దు చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ : ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్ల భర్తీ కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన జీవోలు 107, 108 ను రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ సీట్ల అమ్మకాన్ని రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని, రిజర్వేషన్లకు తూట్లు పొడుస్తున్న జీవోలు 107, 108 ను రద్దు చేయాలని డిమాండ్ చూస్తూ ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో విద్యార్థి, యువజన సంఘాలతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి అధ్యక్షతన శుక్రవారం విజయవాడ దాసరి భవన్‌లో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి కొత్తగా 17 వైద్య కళాశాలలు మంజూరైనట్లు ప్రచారం చేసుకుంటున్నారని తెలిపారు. దీంతో అణగారిన ప్రజలు తమకు మేలు జరుగుతుందని భావించారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రిజర్వేషన్ల ప్రకారం సీట్లు ఇవ్వకుండా డబ్బులు ఉన్నవాళ్లకే సీట్లు ఇచ్చేలా ఈ కొత్త జీవోలను తీసుకువచ్చారని విమర్శించారు. విద్య. వైద్యం, పారిశ్రామికీకరణలు ప్రభుత్వ రంగంలోనే ఉంటే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రైవేటు వాళ్లు వారివారి వ్యాపారంలో భాగంగా ప్రభుత్వం నుంచి అన్ని సౌకర్యాలు, రాయితీలు పొందుతారే తప్ప రిజర్వేషన్లు అమలు చేయరని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం దళిత, గిరిజనులకు ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు ఇస్తున్నట్లు చెబుతోందని, విద్యారంగంలో సీట్లు ఎందుకు ఇవ్వట్లేదని ప్రశ్నించారు. వైద్య సీట్ల భర్తీ విషయంలో అన్ని రాజకీయ పార్టీలు కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైద్య సీట్ల భర్తీ అంశం ప్రధానంగా ఉంటుందన్నారు. జీవోలు 107, 108 ను రద్దు చేయటానికి అన్ని రాజకీయ పార్టీలు, విద్యార్థి, యువజన సంఘాలు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విజయవాడ శాఖ అధ్యక్షుడు డాక్టర్ రసిక్ సాంఘ్వి మాట్లాడుతూ సంపన్నుల కోసం కాకుండా పేదలకు సేవ చేయాలనే ఉద్దేశంతో వైద్య రంగంలోకి వస్తారని, కానీ డబ్బులు కట్టి చదివిన వారికి సేవా భావం ఉండదన్నారు. డొనేషన్ల చదువులో నాణ్యత ఉందని తెలిపారు. కేంద్ర విధానాలను కాకుండా రాష్ట్రం తన సొంత విధానాన్ని అమలు చేస్తే ఇతర రాష్ట్రాల నుంచి, విదేశాల నుంచి వచ్చే వారు ఉండరని అన్నారు. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పేరును వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయంగా మార్చటం వల్ల సర్టిఫికెట్లను విదేశీ సంస్థలు గుర్తించటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం విమర్శగా కాకుండా వాస్తవాలను మరోసారి ఆలోచించాలని విజ్ఞప్తి చేస్తూ, జీవోలు 107, 108 ను ఉపసంహరించుకోవాలన్నారు. దీని కోసం ప్రతి ప్రజాసంఘం, వైద్య రంగంలోని వివిధ సంఘాలు గళం విప్పాలని ఆయన కోరారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ ఏడాది నుంచి మచిలీపట్నం, రాజమహేంద్రవరం, నంద్యాల, విజయనగరం, ఏలూరు నగరాల్లో ఐదు వైద్య కళాశాలలు ప్రారంభం అవుతున్నాయని తెలిపారు. ఈ కళాశాలల్లో 128 సీట్లను మాత్రమే రిజర్వేషన్ల ప్రకారం భర్తీ చేసి మిగిలిన వాటిని బి, సి కేటగిరీలకు కింద భర్తీ చేయనున్నారని అన్నారు. ఇదే విధానాన్ని వచ్చే 12 వైద్య కళాశాలలకు వర్తింపజేస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ప్రభుత్వం బి, సి కేటగిరి విధానాలను ఉపసంహరించుకోవాలన్నారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఆగస్టు 16 నుంచి పోస్టు కార్డుల ద్వారా ప్రభుత్వానికి తెలియజేయాలని ఏఐఎస్ఎఫ్ తరపున పిలుపునిచ్చారు. అనంతరం గవర్నర్‌కు వినతి పత్రాన్ని అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గనిరాజు, రాజశేఖర్, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్, టీఎన్ఎస్ఎఫ్ విజయవాడ పార్లమెంటరీ కార్యదర్శి పి.చరణ్‌సాయి, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఐ.రాజేష్, ఎస్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర కోశాధికారి పంచదార్ల దుర్గాంబ, ఏఐవైఎఫ్ విజయవాడ నగర కార్యదర్శి లంకా గోవిందరాజులు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్, పేరెంట్స్ కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లకు రెడ్ కార్పెట్... కడప ఉక్కుకు స్వస్తి

విశాలాంధ్ర-డిజిటల్ :

విశాఖ ఉక్కును నష్టాల బూచి చూపి ప్రైవేట్‌పరం చేస్తూ కార్పొరేట్ దిగ్గజాలకు ఎర్ర తివాచీ పరిచిన ప్రధాని మోదీ ఏపీలో మరో ఉక్కు పరిశ్రమకు అనుమతి ఇస్తారని, ఎదుగుదలకు సహకరిస్తారని ఆశించడం వెర్రితనమే అవుతుంది. ఆయన నాలుగేళ్లుగా నాన్చి సాంకేతికంగా లాభసాటి కాదన్న సాకుచూపి కడప ఉక్కుకు చెక్ చెప్పడంలో ఆంతర్యం కార్పొరేట్ల వ్యాపారానికి ఎదురు లేకుండా చేయడమే. ఇటీవల లోక్‌సభలో టీడీపీ ఎంపీలు కేశినేని నాని, కె.రామ్మోహన్ నాయుడు ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం, విభజన హామీలు తదితర అంశాలపై అడిగిన ప్రశ్నలకు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లిఖితపూర్వకంగా ఇచ్చిన సమాధానం జగన్ సర్కార్‌కు చెంపపెట్టుగా మారింది. కడప ఉక్కు సాంకేతికంగా కుదరదని కుండబద్దలుకొట్టి చెప్పారు. విభజన సమస్యల పరిష్కారంలో కేంద్రం కేవలం మధ్యవర్తిత్వం మాత్రమే అని చెబుతూ రాష్ట్రాలే పరిష్కరించుకోవాలని స్పష్టం చేశారు. దీనికితోడు ప్రధాని మోదీ ఇటీవల ముఖ్యనేతల సమావేశం నిర్వహించి దేశవ్యాప్తంగా క్షేత్రస్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలంటే అన్ని విధాలా తగిన ఉన్న నాయకులు ఉండి తీరాలన్న సూత్రాన్ని అమలుపరిచి పురందేశ్వరి సరైన నాయకురాలిగా తలచి ఆంధ్ర ప్రదేశ్‌కు పంపడం జగన్ రాజకీయ కుయుక్తులకు, స్పీడ్‌కు బ్రేకులు వేయడానికేనని స్పష్టమవుతోంది. అస్త్రశస్త్రాలు సంధించి జగన్ ప్రాబల్యం తగ్గించాల్సిందేనని దిశానిర్దేశం చేసినట్టు తెలుస్తోంది. సరిగ్గా ఎన్నికలకు ఏడాది సమయం ఉండగా కడప ఉక్కుకు సారీ చెప్పడం వెనుక మరో ఆంతర్యం బీజేపీని బలోపేతం చేసి జగన్ ప్రాబల్యానికి చెక్ పెట్టడానికేనని తెలుస్తోంది. ఒకే దెబ్బకు రెండు పిట్టలన్నట్టుగా ఉక్కును పక్కనపెట్టినట్టుగానే రాజకీయంగా జగన్‌ను దెబ్బకొట్టాలన్న ఉద్దేశంతో పురందేశ్వరిని రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమించడంతో పాటు వైసీపీతో తెరచాటు స్నేహం చేస్తున్న బీజేపీ జాతీయ కార్యదర్శి, ఏపీ సహ ఇన్‌ఛార్జ్ సునీల్ దేవధర్‌ను పక్కనబెట్టి వాక్ పటిమతో ప్రత్యర్థులకు ముచ్చెమటలు పట్టించే తెలంగాణ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు బండి సంజయ్‌ను ఏపీ ఇన్‌ఛార్జ్‌గా నియమించడం అందుకు నిదర్శనం.

కడప ఉక్కు ఫ్యాక్టరీ చుట్టూ ఒకటిన్నర దశాబ్దాల కాలంగా రాజకీయం నడుస్తూనే ఉంది. ఓట్ల రాజకీయం కోసమే రెండుసార్లు జగన్ శంకుస్థాపనలు చేసినట్టుగా సామాన్య ప్రజానీకం చెబుతోంది. దీనికి అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికలు సమీపిస్తున్న వేళ జగన్ ప్రాభవం తగ్గించాలని బీజేపీ కంకణం కట్టుకున్నట్టు కనిపిస్తోంది. దీనిలో భాగంగానే కడప ఉక్కుకు పాతరేసి క్షేత్రస్థాయిలో తమ పార్టీని బలోపేతం చేసుకునేందుకు బీజేపీ అధిష్ఠానం రాష్ట్ర రాజకీయాల్లో పెద్దఎత్తున మార్పులు చేసినట్టు సుస్పష్టమవుతోంది. నాటి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కడప ఉక్కు పరిశ్రమకు బీజం పడింది. 2007 జూన్ 10న జమ్మలమడుగు వద్ద అంబవరం సమీపంలో బ్రహ్మణి స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు ఆయన శంకుస్థాపన చేశారు. వైఎస్ మరణించడంతో అదికాస్త అటకెక్కింది. వైఎస్ తదనంతరం సరిగ్గా పదేళ్లకు 2014లో విభజన అనంతరం ఏపీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు గండికోట రిజర్వాయర్ ఎగువన కంబాలదిన్నె ప్రాంతాన్ని ఎంచుకుని 2018 డిసెంబరు 27న శంకుస్థాపన చేశారు. రాజకీయం శాశ్వతం కాదన్నట్టుగా 2019 ఎన్నికల్లో ఓటర్ల తీర్పు వైసీపీకి అనుకూలంగా మారడంతో పదవి నుంచి తప్పుకున్నారు. వైఎస్, చంద్రబాబు తర్వాత సీఎంగా అధికారపగ్గాలు చేపట్టిన వైఎస్ జగన్ హడావిడిగా 2019 డిసెంబరు 23న, ఫిబ్రవరి 15, 2023న జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె పరిధిలోని పెద్దగండ్లూరు వద్ద శంకుస్థాపన చేశారు. యువతకు పెద్దఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని నమ్మబలికారు. సరిగ్గా సార్వత్రిక ఎన్నికలు ఏడాదిలో ఉండగా మరోసారి ఓటర్లను ఏమర్చే ప్రయత్నం చేశారు. ఇదంతా గమనిస్తున్న మోదీ... కడప ఉక్కుకు బైబై చెప్పి జగన్ రాజకీయ ఎదుగుదలకు చెక్‌పెట్టారు.

ఇంతవరకు బాగానే ఉన్నా... ఆంధ్రకు ప్రధాన పరిశ్రమగా ఉన్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేయడం, కడప ఉక్కుకు బైబై చెప్పడం బీజేపీకి కలిసొచ్చే అంశాలు కావు. పార్టీని బలోపేతం చేయాలంటే విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కుగా పరిగణిస్తే కొంతమేర పార్టీని ఏపీలో బతికించుకుంటూ ప్రజల విశ్వాసాన్ని పొందవచ్చన్న విషయాన్ని ఉద్దండులైన రాజకీయ నేతలు మర్చిపోవడం అజ్ఞానమే. పైకి జగన్ ప్రాబల్యం తగ్గిస్తున్నామని సంబరపడుతున్నా క్షేత్రస్థాయిలో ప్రజలు ఆ పార్టీని నమ్మేస్థితిలో లేరన్న వాస్తవాన్ని మరుగునపరచడం స్వయం కృతాపరాధం అవుతుంది. టీడీపీ జోరు పెరుగుతుండడం వైసీపీకి తలనొప్పిగా మారినా, విశాఖ ఉక్కుపై బీజేపీ తప్పిదాలు ఆ పార్టీకి కలిసొచ్చే అంశాలు కావని రాజకీయ విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

వాయిదాలు, నిరసనలు, సస్పెన్షన్లు

(మొదటిపేజీ తరువాయి)

ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై దాదాపు 20 గంటలు చర్చించగా 60 మంది సభ్యులు పాల్గొన్నారు. అవిశ్వాస తీర్మానానికి సమాధానంగా ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో ప్రధాని విరుచుకుపడ్డారు.

ఇందుకు నిరసనగా ప్రతిపక్ష సభ్యులు వాకౌట్ చేయగా మూజువాణీ ఓటు ద్వారా అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి సస్పెన్షన్ కూడా విపక్షాలకు కోపం తెప్పించింది. దీంతో స్పీకర్ ఓం బిర్లా ముగింపు ప్రసంగాన్ని బహిష్కరించారు.

ఈసారి సమావేశాల్లో 17 సిట్టింగులు జరిగాయని, సభ 44గంటల13 నిమిషాలు పనిచేసిందని ఓంబిర్లా తెలిపారు. 20 బిల్లులను ప్రవేశపెట్టగా 22 ముసాయిదా చట్టాలను దిగువసభ ఆమోదించిందని చెప్పారు. వివాదాస్పద ఢిల్లీ బిల్లు, డిజిటల్ వ్యక్తిగత డేటా సంరక్షణ బిల్లుతో పాటు అనేక కీలక బిల్లులు ఆమోదం పొందాయి. అటు రాజ్యసభలో మణిపూర్ అల్లర్లపై చర్చ కోసం ప్రతిపక్షాలు డిమాండ్ చేయగా మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదాలు కొనసాగాయి. ప్రశ్నోత్తరాలను చైర్మన్ ధన్కర్ చేపట్టిన వెంటనే ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేస్తూ మణిపూర్ పరిస్థితిపై చర్చకు, ప్రధాని మోదీ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ధన్కర్ స్పందిస్తూ జులై 20న సభాపతి చెప్పినదాంతో మీరు అంగీకరించివుంటే నేడు ఈ పరిస్థితి వచ్చేది కాదని (స్వల్పకాలిక చర్చనుద్దేశించి) అన్నారు.

'లోక్‌సభలో దీనిపై చర్చ జరిగింది, ఇక్కడ కూడా జరిగివుండేది. కానీ మీరు ఆ అవకాశాన్ని కోల్పోయారు' అని ఆయనన్నారు. ప్రతిపక్ష సభ్యులు కొందరు వెల్‌లోకి వెళ్లి నినాదాలు చేశారు. దీంతో సభ మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా పడింది. అంతకుముందు డీఎంకే ఎంపీ తిరుచీ శివ మాట్లాడుతూ సభలో 167 నిబంధన కింద మణిపూర్‌పై చర్చకు గురువారం తాను నోటీసు ఇవ్వగా సభాపతి అంగీకరించడాన్ని గుర్తుచేశారు. శుక్రవారం ఉదయం వరకు వేచిచూసినప్పటికీ ప్రభుత్వం వైపునకు సమాధానం రాలేదని చెప్పారు. చర్చకు మేము సిద్ధమే వారే లేరని వ్యాఖ్యానించారు. అంతకుముందు రాజస్థాన్‌లో శాంతి భద్రతలపై బీజేపీ సభ్యుడి పాయింట్ ఆఫ్ ఆర్డర్‌ను ప్రవేశపెట్టారు. దీనిని విపక్షాలు నిరసించడంతో గందరగోళం నెలకొంది. శాంతించాలని చైర్మన్ చెప్పినా సభ్యులు వినలేదు. దీంతో ఆయన మధ్యాహ్నం 12 వరకు సభను వాయిదా వేశారు.

ఐదుగురు సభ్యులకు వీడ్కోలు పలికే సమయంలో రాజస్థాన్ అంశాన్ని బీజేపీ నేత కిరోడి లాల్ మీనా ప్రస్తావించగా రభస జరిగింది. ఆయన పాయింట్ ఆఫ్ ఆర్డర్‌ను సభాపతి తిరస్కరించారు.

విధుల భారం

(మొదటిపేజీ తరువాయి)

గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ ఇటీవల ఉత్తర్వులు జారీజేశారు. గ్రామ సచివాలయంలో సమాచార హక్కు అధికారి(పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్-పీఐవో), సమాచార హక్కు సహాయ అధికారి (అసిస్టెంట్ పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్-ఏపీఐఓ)ను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్లతోపాటు పంచాయతీ కార్యదర్శికి బాధ్యతల్ని అప్పగించింది. డిజిటల్ అసిస్టెంట్‌కు ఏపీఐవో, పంచాయతీ కార్యదర్శికి పీఐవో కార్యకలాపాల్ని నిర్వహించాలని ఉత్తర్వులిచ్చింది. ఆయా గ్రామ సచివాలయ స్థాయిలో పరిష్కారంకాని వినతులపై అప్పిలేట్ అథార్టీగా మండల ఏంపీడీవోకు బాధ్యతల్ని అప్పగించింది. ఒక్క గ్రామ సచివాలయంలోనే ఈ సమాచార హక్కు చట్టం తీసుకొచ్చింది.

వార్డు సచివాలయాలకు ఆర్టీఐ దూరం

వార్డు సచివాలయాల్లో ఆర్టీఐ వ్యవస్థను తీసుకురాలేదు. ప్రభుత్వ ఉత్తర్వుల్లో కేవలం గ్రామ సచివాలయాలకే పరిమితం చేసింది. వార్డు సచివాలయాల్లోనూ అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అందనివారంతా వార్డు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వారి సమస్యల్ని పరిష్కరించకుండా వార్డు సచివాలయ సిబ్బంది... ఒకరిపై ఒకరు నెట్టుకుంటున్నారు. ఈ విధానాలతో ప్రజలు విసిగిపోతున్నారు. ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన అమ్మఒడి పథకం నిధులు తల్లుల ఖాతాల్లో పడక చాలా మంది వార్డు, గ్రామ సచివాలయాలకు బారులు తీరారు. వార్డు సచివాలయాల్లో వారికి సరైన సమాచారం రాలేదు. తమ పరిధిలో లేదని బ్యాంకు అధికారులను కలవాలంటూ దాటవేత ధోరణితో వ్యవహరించినట్లు తెలుస్తోంది. దీంతోపాటు అనేక సంక్షేమ పథకాలపైనా ఇదే సమస్యలు ప్రజలకు ఎదురవుతున్నాయి. కొత్తగా రేషన్ కార్డు కోసం చాలా మంది దరఖాస్తులు ఇచ్చినప్పటికీ, దానిపై స్పందన లేదు. జగనన్న సురక్ష పథకంలో లక్షలాదిగా వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం ప్రభుత్వానికి అర్జీలిచ్చారు. అర్జీల స్వీకరణ వేగవంతంగానే ముగిసింది. అందులో 11 రకాల ధృవీకరణ పత్రాలకు అర్జీలు స్వీకరించినప్పటికీ కుల, ఆదాయ తదితర ధ్రువీకరణ పత్రాల్ని త్వరగానే ఇచ్చారు. కానీ తెల్ల కార్డు కోసం దరఖాస్తు చేసిన వారికి ఇంతవరకు ఇవ్వలేదు. అసలు అర్జీలు ఏ స్థితిలో ఉన్నాయనేది ప్రశ్నార్థకంగా మారింది. అందువల్ల వార్డు సచివాలయాల్లోనూ ఆర్టీఐ చట్టం తీసుకొస్తే, ప్రజలిచ్చే అర్జీల పరిస్థితి, సమస్యలపైనా వివరణ అడిగేందుకు దోహదపడుతుంది. గ్రామ సచివాలయాల మాదిరిగానే వార్డు సచివాలయాల్లోనూ ఆర్టీఐ చట్టం తేవాల్సిన అవసరముంది. వారికి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి ఉపాధిని కల్పించాలి. ఉన్న సిబ్బందిపైనే ఈ బాధ్యతల్ని నిర్వహించడం వల్ల వారిపై పనిభారం పడుతుందన్న విమర్శలున్నాయి.

సచివాలయాల ఖాళీల భర్తీలో జాప్యం

సచివాలయ వ్యవస్థలో ఉద్యోగాలు పొందిన వారిలో, కొందరు పదోన్నతులపై వివిధ ఉద్యోగాలకు వెళ్లిపోవడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. వీటి సంఖ్య రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సచివాలయాల్లో దాదాపు 10వేల నుంచి 13వేల వరకు ఉండవచ్చని అంచనా. ఇప్పటికే సచివాలయాల ద్వారా రెండు విడతలుగా ప్రభుత్వం ఉద్యోగాల్ని భర్తీ చేసింది. మూడో విడత భర్తీలో జాప్యం ఏర్పడుతోంది. దీనివల్ల ఉన్న వారిపై అదనంగా పని భారం పడుతోంది. కార్యదర్శులు అదనంగా పక్క సచివాలయాల్లో ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వహించాల్సి పరిస్థితి ఏర్పడింది. తొమ్మిది నెలల్లోపు ఎన్నికలు రానున్నాయి. ఈలోగా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ప్రభుత్వం ప్రకటన విడుదల చేయాలని నిరుద్యోగులు కోరుతున్నారు. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థకు అనుబంధంగా డిజిటల్ లైబ్రరీల ఏర్పాటుకు సీఎం జగన్ ఆదేశించారు. ఇంతవరకు వాటి నిర్మాణం పూర్తి దశకు చేరలేదు. ఇవి పూర్తయితే, గ్రంథాలయ కోర్సులు చదివిన వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు లభిస్తాయని ఎదురు చూస్తున్నారు.

విద్వేష ప్రసంగాలు ఆమోదయోగ్యం కాదు

(మొదటిపేజీ తరువాయి)

హింసాత్మక ఘటనలు ఆమోదయోగ్యం కాదు. రాజ్యాంగం కల్పించిన వ్యక్తిగత స్వేచ్ఛ, స్వతంత్రత, గౌరవానికి ఇవి విఘాతం కలిగిస్తాయని' అని సీజేఐ చంద్రచూడ్ అన్నారు.గుంపుగా దాడులు చేస్తే శిక్ష నుంచి తప్పించుకోవచ్చని భావిస్తారు కాబట్టే మూకలు మరింతగా రెచ్చిపోయి మహిళలపై హింసకు పాల్పడతాయని వ్యాఖ్యానించారు. లక్షిత వర్గాలకు అణచివేత సందేశాన్ని పంపేందుకు లైంగిక హింసను అల్లరి మూకలు వాడతారు. ఇందుకు మహిళలపై దాడులు చేయడం అత్యంత దారుణం. వీటిని నివారించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే' అని సీజేఐ నేతృత్వ జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం పేర్కొంది. ఈనెల 7న ఇచ్చిన ఈ తీర్పు తాజాగా అందుబాటులోకి వచ్చింది. దర్యాప్తును పూర్తిచేయడానికి నిందితులు అవసరమని, పోలీసులు నిందితులను త్వరితగతిన గుర్తించి, అరెస్టు చేయడం ఎంతో కీలకమని ధర్మాసనం పేర్కొంది. ఆలస్యమైతే ఆధారాలను లేకుండా చేయడం, సాక్షులను బెదిరించడం, అక్కడి నుంచి తప్పించుకుపోయే ప్రమాదం ఉందని తెలిపింది.

ఇటువంటి వర్గ పోరు.. భారీ స్థాయిలో ఆస్తి నష్టానికి దారితీస్తుందని, వాటికి అడ్డుకట్ట వేయడం చట్టబద్ధ పాలన బాధ్యతని అని తేల్చిచెప్పింది. ఈ తరహా ఘటనలు పునరావృతం కాకుండా భరోసా కల్పించేందుకే ఇందులో జోక్యం చేసుకుంటున్నట్లు స్పష్టంచేసింది. హరియాణాలో మతఘర్షణలపై వేరుగా విచారించిన సర్వోన్నత న్యాయస్థానం ఆ రాష్ట్ర డీజీపీ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేయాలని సూచించింది. వర్గాల మధ్య సామరస్యత అవశ్యమని నొక్కిచెప్పింది. విద్వేష ప్రసంగాలతో ఎవరికి మంచి జరగబోదని, వాటిని ఎవరూ అంగీకరించలేరని తెలిపింది. ముగ్గురు లేదా నలుగురు అధికారులతో కమిటీని ఏర్పాటు చేయమని డీజీపీకి చెబుతాం. ఎస్‌హెచ్‌ఓ స్థాయి, పోలీసు స్థాయిలో సభుయలు ఉండవచ్చు అని, సమగ్ర దర్యాప్తు జరిపించి సమాచారాన్ని సేకరించాలని న్యాయస్థానం సూచించింది. స్టేషన్ హౌస్ అధికారుల వద్ద ఉన్న సమాచార వాస్తవికతను ధ్రువీకరించాలని పేర్కొంది.

ఎస్ఐ పోస్టులకు 25న శారీరక సామర్థ్య పరీక్షలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎస్ఐ(సివిల్)-పురుషులు, మహిళలు, ఎస్ఐ (ఏపీ ఎస్‌బి)-పురుషుల విభాగం ఉద్యోగాలకు ఈనెల 25న శారీరక, సామర్థ్య పరీక్షలను నిర్వహిస్తారని ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ అతుల్ సింగ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవెల్ పోలీస్ రిక్రూటెమెంట్ బోర్డ్ 315 ఎస్ఐ (సివిల్), 96 ఎస్ఐ (ఏపీ ఎస్‌బి) ఉద్యోగాల భర్తీకి గాను ఈ ఏడాది ఫిబ్రవరి 19 న రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ప్రాథమిక రాత పరీక్షను నిర్వహించింది. దీనికి మొత్తం 57,923 మంది అర్హత సాధించగా, అందులో 56,116 మంది శారీరక సామర్థ్య పరీక్షలకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో పురుషులు-47,927, మహిళలు-8,190 మంది ఉన్నారు. వీరికి విశాఖపట్నం కేంద్రంగా 17,371 మందికి, ఏలూరు-9,685, గుంటూరు-12,956, కర్నూలు-16,104 మంది చొప్పున శారీరక సామర్థ్య పరీక్షలు నిర్వహిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 14వ తేదీ నుంచి కాల్ లెటర్‌లు పంపుతామని, పూర్తి వివరాలను www slprb.ap.gov.in వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచి ఆయన పేర్కొన్నారు.

నేరస్మృతులకు కొత్త తొడుగు

(మొదటిపేజీ తరువాయి)

జరిపే నిబంధన చేర్చారు. పోలీసులు చేసే సెర్చ్ ఆపరేషన్లలో వీడియోగ్రఫీ, ఏడేళ్లు అంతకంటే ఎక్కువ జైలుశిక్ష పడే కేసుల్లో నేరం జరిగిన ప్రదేశానికి ఫోరెన్సిక్ బృందం వెళ్లి పరిశీలించడం తప్పనిసరి వంటి అంశాలు ఇందులో ఉన్నాయి. న్యాయస్థానాల్లో తీర్పుల నిష్పత్తిను 90శాతానికి తీసుకెళ్లడమే లక్ష్యంగా ఈ బిల్లులను రూపొందించామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. బిల్లులను ప్రవేశపెట్టిన తర్వాత అమిత్‌షా మాట్లాడుతూ 'పాత చట్టాలు 19వ శతాబ్దానికి చెందినవి. అవన్నీ బానిసత్వానికి చిహ్నం. ఆంగ్లేయుల పాలనను రక్షించడం, బలోపేతం చేయడంతోపాటు శిక్షించడమే లక్ష్యంగా వాటిని ప్రవేశపెట్టారు. బాధితులకు న్యాయం చేయడం వాటి ఉద్దేశం కాదు! వాటి స్థానంలో ప్రవేశపెట్టనున్న ఈ మూడు చట్టాలు.. భారత పౌరుల హక్కులను పరిరక్షిస్తాయి. ఈ బిల్లులు నేర న్యాయవ్యవస్థలో సమూల మార్పులు తెస్తాయని హామీ ఇవ్వగలను' అని అన్నారు. శిక్ష వేయడం కాకుండా.. న్యాయం అందించడమే ఈ కొత్త చట్టాల లక్ష్యమన్నారు. కొత్త బిల్లులను హోం వ్యవహారాల పార్లమెంటరీ స్థాయి సంఘం పరిశీలనకు పంపాలని స్పీకర్ ఓం బిర్లాకు అమిత్‌షా సూచించారు. ఈ చట్టాల్లో మొత్తంగా 313 మార్పులు తీసుకురానున్నట్లు తెలిపారు.

ప్రపంచస్థాయిలో ఎస్వీ మ్యూజియం అభివృద్ధి

- డిసెంబర్ నాటికి పనులు పూర్తి
- టీటీడీ చైర్మన్ భూమన వెల్లడి

విశాలాంధ్ర-తిరుమల: తిరుమలలోని శ్రీవేంకటేశ్వర మ్యూజియం అభివృద్ధి పనులు ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తవుతాయని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఇందుకయ్యే రూ.145 కోట్లను భరించేందుకు టాటా సంస్థ ముందుకొచ్చినట్లు తెలిపారు. ఎస్వీ మ్యూ జియం వద్ద శుక్రవారం నిర్వహించిన పూజ కార్యక్రమంలో ఈవో ఏవీ ధర్మారెడ్డితో కలిసి పాల్గొన్న భూమన... అనంతరం మీడియాతో మాట్లాడారు. దాదాపు 3 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మ్యూజియాన్ని సందర్శకులను ఆకట్టు కునేలా ప్రపంచస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. విరాళం ప్రాతిపదికన రూ.145కోట్ల ప్రాజెక్టును చేపట్టేందుకు ముందుకు వచ్చినందుకు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)మ్యాప్ సిస్టమ్స్ సంస్థలకు ధన్యవాదాలు తెలిపారు. మొత్తం 19 గ్యాలరీలు ఉన్నాయని, వాటిలో ఐదింటిని బెంగళూరుకు చెందిన మ్యాప్ సిస్టమ్స్ రూ.20 కోట్లతో, మిగిలిన 14 గ్యాలరీలను టీసీఎస్ రూ. 125 కోట్లతో అభివృద్ధి చేస్తున్నాయని చెప్పారు. అంతర్జాతీయ ప్రమాణా లతో మ్యూజియం అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ఇందులో గ్రౌండ్‌ఫ్లోర్ లో తిరువీధులు, తిరుమల ఆలయ అనుభూతి, వాహన సేవలు, స్వామివారి సేవలు, సప్తగిరుల గ్యాలరీలు ఉన్నాయని, వీటిని బెంగళూరుకు చెందిన మ్యాప్ సిస్టమ్స్ సంస్థ వారు అభివృద్ధి చేస్తున్నారని చెప్పారు. మిగిలిన గ్యాలరీలను టీసీఎస్ సంస్థవారు ఆధునీకరణ చేస్తున్నారని వివరించారు. గ్రౌండ్ ఫ్లోర్ లో వేంకటేశ్వరుడి రాతి విగ్రహాలు, కాంస్య విగ్రహాలు, దారు విగ్రహాలు, అన్నమయ్య రాగి రేకులు, పురాతన నాణేల గ్యాలరీలు ఉన్నాయన్నారు. మొదటి ఫ్లోర్ లో శ్రీవారి ఆలయ శిల్పకళా వైభవం, భక్తాగ్రేసరులు- వారి సేవలు, యుద్ధ పరికరాలు, సంగీత వాయిద్యాలు, పూజా సామగ్రి గ్యాలరీలు వంటి అనేక అద్భుతాలు కొలువుతీరనున్నాయన్నారు. రెండవ ఫ్లోర్‌లో విరాట్ పురుషుడు, బ్రహ్మ, మహేశ్వరులు, ఋగ్వేదం,యజుర్వేదం గ్యాలరీలు ఉన్నాయని, మూడో ఫ్లోర్‌లో బ్రహ్మాండ గ్యాలరీ కొలువై ఉందని చెప్పారు. మ్యూజియం పైభాగంలో 17 పెద్ద గోపురాలు ఉన్నాయని, వీటిలో శ్రీ తాళ్లపాక అన్నమయ్య, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ, శ్రీ పురందరదాస, శ్రీ రామానుజాచార్యులు, శ్రీ శంకరాచార్యులు, శ్రీ మధ్వాచార్యులు వంటి భక్తాగ్రే సరులతో పాటు రామాయణం, మహాభారతం, భగవద్గీత లాంటి మహాగ్రంథాలకు సంబంధించిన ఆసక్తికర అంశాలను ప్రదర్శిస్తామని వివరించారు. మరుగున పడిన సనాతన ధార్మిక అంశాలను భవిష్యత్ తరాలకు అందిం చేందుకు మ్యూజియం ఎంతగానో దోహదపడుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. అంతకుముందు టీటీడీ ఈవో ఎస్వీ మ్యూజియం నిర్మాణ ప్రణాళిక, డిజైన్‌ను డిస్‌ప్లే ద్వారా చైర్మన్‌కు అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ్ కుమార్, ఎస్ఈ-2 జగదీశ్వర్ రెడ్డి, మ్యూజియం అధికారి కృష్ణారెడ్డి, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీదేవి, చీఫ్ ఆడిట్ అధికారి శేష శైలేంద్ర, విజివోలు బాలిరెడ్డి, గిరిధరరావు, టీసీఎస్, మ్యాప్ సిస్టమ్స్‌కు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్ల తొలగింపు అమానుషం

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

విశాలాంధ్ర-విజయవాడ: పంచాయితీ రాజ్ శాఖలో 731 మంది టెక్నికల్ అసిస్టెంట్ కంప్యూటర్ ఆపరేటర్ల తొలగింపు చర్య అమానుషమని, వారిని విధుల్లో కొనసాగించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ప్రభుత్వాన్ని శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద గత 13 ఏళ్లుగా టెక్నికల్ అసిస్టెంట్ కంప్యూటర్ ఆపరేటర్లుగా జిల్లాలలో పని చేస్తున్న 731మందిని శనివారం నుంచి విధులకు రావాల్సిన అవసరం లేదని, నిధుల కొరత వల్ల తొలగిస్తున్నామని పంచాయతీ రాజ్‌లోని ప్రధాన ఇంజినీరింగ్ అధికారి ఉత్తర్వులు జారీ చేయడాన్ని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్తర్వులను వెంటనే ఉప సంహరించుకోవాలని కోరారు. 13 ఏళ్ల సర్వీసు ఉన్న ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమ - నిబంధనలు పాటించకుండా ఏపీ సీఓఎస్ నోటీసులు జారీ చేయడం అప్రజాస్వామికం, చట్టవిరుద్ధమని ఓబులేసు పేర్కొన్నారు.

వైద్య విద్యను దూరం చేయడం దారుణం

ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్ బాబు

విశాలాంధ్ర - విశాఖ: మెడికల్ సీట్లలో ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నెంబర్ 107, 108లను తక్షణం రద్దు చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.లెనిన్ బాబు డిమాండ్ చేశారు. విశాఖలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలల్లో బి, సి కేటగిరీలను రద్దు చేసి, రిజర్వేషన్ల ప్రకారం సీట్లను భర్తీ చేయాలని అన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లోనే అణగారిన వర్గాల రిజర్వేషన్లకు తూట్లు పొడుస్తూ.. ప్రైవేటు కళాశాలకు మేలు జరిగేలా ప్రభుత్వం వ్యవహరిస్తుందని, దీనిని ఏఐవైఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని స్పష్టం చేశారు. తక్షణమే జీవోలు 107, 108 రద్దు చేయాలని, లేని పక్షంలో అన్ని విద్యార్థి సంఘాలతో కలిసి ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. గ్రూప్-1, గ్రూప్ -2, మెగా డీఎస్సీ విడుదల చేయాలని కోరారు. నిరుద్యోగ యువత జాబ్ క్యాలెండర్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగ యువతను నిట్టనిలువునా ముంచుతున్నదని విమర్శించారు. ఎస్సై, కానిస్టేబుల్ ఉద్యోగా లకు శారీరక దారుఢ్య పరీక్షలు తక్షణమే నిర్వహించాలన్నారు. ఈ కార్యక్ర మంలో విశాఖ జిల్లా సమితి తరపున వై.రాంబాబు, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యుంగంధర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, అచ్యుత్, సందీప్, మధురెడ్డి, పార్వతీపురం జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్, అల్లూరి సీతారామ రాజు జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, కన్నబాబు, విశాఖ జిల్లా సమితి నాయకులు పాల్గొన్నారు.

వీఐటీలో బ్లాక్ చైన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

ఉపకులపతి డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి వెల్లడి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయం ఆతిథ్యంలో త్వరలో తమ ప్రాంగణంలో బ్లాక్ చైన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయనున్నట్లు విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఎస్వీ కోటారెడ్డి తెలిపారు. ఐడీఎస్ ద్వారా నిర్వహించిన భారత్ బ్లాక్ చైన్ యాత్ర, బ్లాక్ చైన్ టెక్నాలజీ.. వ్యాపార నెట్‌వర్క్‌లో పారదర్శక సమాచారాన్ని పంచుకోవడానికి వీలు కల్పించే విధంగా ఏఐసీటీఈ, విద్యారంగ మంత్రిత్వశాఖ సహకారంతో ముందుకు సాగనుందని తెలిపారు. వీఐటీ-ఏపీ విశ్వవిద్యాలయ పరిశోధనలో ఎప్పుడూ ముందుంటుందని, దీనిలో భాగంగానే బ్లాక్ చైన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ పూర్తిగా ఐడీఎస్ నిధులతో ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఐడీఎస్ సీఈవో సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ఐడీఎస్ వీఐటీ- ఏపీ విశ్వ విద్యాలయానికి పాలివర్సిటీ మెటావర్స్ ల్యాండ్ పార్శిల్ కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. భారత్ బ్లాక్ చైన్ యాత్ర కన్వీనర్ ఓరుగంటి అరవింద్ మాట్లాడుతూ, భారత్ బ్లాక్ చైన్ యాత్రకు ఆతిథ్యం ఇస్తున్న మొదటి విశ్వవిద్యాలయం వీఐటీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రభా సెల్వరాజ్, డాక్టర్ ప్రదీప్ రెడ్డి, సునీల్ యడవల్లి ఐడీఎస్ బిజినెస్ హెడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేస్తే సహించం

ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ ఉపాధ్యక్షులు జి.ఈశ్వరయ్య

విశాలాంధ్ర-కడప రూరల్: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) 88వ వార్షికోత్సవాల సందర్భంగా శుక్రవారం కడప కోటిరెడ్డి సర్కిల్ నుంచి వన్‌టౌన్ వరకు ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయిన ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ ఉపాధ్యక్షులు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య 1936 ఆగస్టు 12న బెనారస్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటై దేశంలో అందరికీ విద్య, వైద్యం, న్యాయం కోసం నిరవధిక పోరాటం చేస్తోందని అన్నారు. దేశంలో విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేయడానికి కాషాయ మూకలు నూతన విద్యా విధానాన్ని ముందుకు తీసుకువచ్చాయని విమర్శించారు. యూజీసీ, భారత వైద్య మండలి (ఎంసీఐ) వంటి సంస్థలను నిర్వీర్యం చేస్తోందన్నారు. దుర్మార్గపూరితంగా విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను చీకటి రోజుల్లోకి నెట్టివేసే ప్రయత్నం జరుగుతున్నదని, వెంటనే విద్యార్థులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. లౌకిక భావాలు కలిగిన దేశంలో మతోన్మాదుల ఉన్మాదంతో ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుందని తెలిపారు. ఏఐఎస్ఎఫ్ 88వ వార్షికోత్సవాల సందర్భంగా పోరాటాలకు వేదిక కానున్నదని అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రాథమిక విద్యను మొదలుకొని ఉన్నత విద్య వరకు అమ్ముతున్నాడని, విద్యార్థుల తల్లిదండ్రులకు హామీలు ప్రకటించి, జేబుదొంగ ప్రభుత్వంగా మరో చేత్తో లాక్కుంటున్నాడని, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు కూడా అందజేయలేదని విమర్శించారు. వైద్య విద్యను అమ్ముకోవడం సమంజసం కాదని అన్నారు. జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమ ప్రభుత్వమా, వ్యాపార ప్రభుత్వమే తేల్చుకోవాలన్నారు. విద్యార్థుల సంక్షేమం మరిచిపోతే పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. డీఎస్సీ, జూనియర్ లెక్చరర్ల నియామకాలు వెంటనే చేపట్టాలని, విద్యాసంస్థలకు నిధుల విడుదల సహా పెండింగ్‌లో ఉన్న అన్నింటినీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.వలరాజు, జిల్లా అధ్యక్షులు పి.పవన్ కుమార్, సహాయ కార్యదర్శి శరత్, జిల్లా ఉపాధ్యక్షులు లీలా కృష్ణ, నగర అధ్యక్ష, కార్యదర్శులు బి.అరుణ్, కె.శివశంకర్, నాయకులు అకిరా నందు, మల్లికార్జున, వంశీ, లక్ష్మినారాయణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఇళ్లకే రేషన్ హర్షణీయం

మా రాష్ట్రంలో ఈ విధానం అమలు చేస్తాం

కర్నాటక ఆహార, పౌర సరఫరాల శాఖమంత్రి మునియప్ప

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులను లబ్ధిదారుల ఇళ్లకే అందిస్తున్న విధానం వినూత్న ప్రయత్నమని, ఆచరణీయమని కర్నాటక రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖామంత్రి కె.హెచ్. మునియప్ప ప్రశంసించారు. వ్యక్తిగత పనులపై విజయవాడ వచ్చిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మునియప్పకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పుష్పగుచ్ఛం అందించి కార్యాలయంలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం గోడౌన్, ఎండీయూ వాహనం, పంపిణీకి సిద్ధంగా ఉన్న రేషన్ సరుకులను మునియప్ప పరిశీలించి లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులను అందిస్తున్నందుకు అభినందించారు. రాయలసీమ జిల్లాల్లో పంపిణీ చేస్తున్న రాగులు, జొన్నలు పరిశీలించి ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం తీసుకుంటున్న శ్రద్ధను కొనియాడారు. రేషన్ సరుకుల్లో ఫోర్టిఫైడ్ బియ్యంతో లబ్ధిదారులకు పుష్కలంగా పోషకాహారం అందుతుందని, మధ్యాన్న భోజనంలో చిన్నారులకు ఫోర్టిఫైడ్ బియ్యంతో చేసిన అన్నం వడ్డించటం వల్ల వారు మరింత ఆరోగ్యంగా ఉంటారని మెచ్చుకున్నారు. బాలింతలు, గర్భిణీలు ఫోర్టిఫైడ్ బియ్యం తీసుకోవటం వల్ల రక్తహీనత తదితర వ్యాధులు దరిచేరబోవని చెప్పారు. రేషన్ ద్వారా పంపిణీ చేస్తున్న గోధుమపిండి తదితర సరుకుల నాణ్యత మెరుగ్గా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇంటింటికీ రేషన్ పంపిణీ చేస్తున్న విధానంపై మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావును అనేక వివరాల్ని మునియప్ప అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికీ రేషన్ పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనాలను ఆయన పరిశీలించి ఈ పద్ధతి ఎంతో చక్కగా ఉందని, తమ రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి ఈ తరహా విధానం అమలు చేయటానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ హెచ్. అరుణ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల వాగ్దానాన్ని విస్మరించిన పాలకులు

ఖాళీ పోస్టుల భర్తీలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

ఏపీ నిరుద్యోగ పోరాట సమితి సమావేశంలో వక్తలు

విశాలాంధ్ర-విశాఖ : ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామంటూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తుంగలోకి తొక్కాయని వక్తలు విమర్శించారు. ఏపీ నిరుద్యోగ పోరాట సమితి (ఏపీఎన్‌పీఎస్) అధ్వర్యంలో శుక్రవారం ఉదయం పౌర గ్రంథాలయంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు మద్రివేముల శ్రీనివాస్ అధ్యక్షతన రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి ఆచార్య బాలమోహన్ దాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు గంప గోవింద్, ఏపీటీ మాజీ అధ్యక్షులు కొయ్య ప్రసాద్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు ఎల్.రామారావు, ఆప్ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర రావు, టీడీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆరేటి మహేష్, ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షులు మున్నంగి నాగరాజు, ఆచార్య సూరప్పడు, బీఆర్ఎస్ నాయకులు జె.టి.రామారావుతో పాటు టీఎన్ఎస్ఎఫ్, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఎన్ఎస్‌యూఐ, వికలాంగుల సంఘం, యువజన, నిరుద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశం అభివృద్ధి చెందాలన్నా సహజవనరులతో పాటు మానవ వనరుల అభివృద్ధి ఎంతో ముఖ్యమైనదన్నారు. 142 కోట్ల జనాభా కలిగిన భారతదేశంలో 40 కోట్ల మంది యువకులు ఉన్నారని తెలిపారు. మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా కింద సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు, 2 కోట్ల మందికి శిక్షణ లక్ష్యమని ఎన్నికల ప్రచారంలో ప్రకటించిన బీజేపీ ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. జర్మనీ, బ్రిటన్, జపాన్, చైనా పాఠశాల స్థాయి నుంచే నైపుణ్య విద్యపై దృష్టి సారించి తద్వారా నూతన పరిశ్రమలకు అవసరమైన నిపుణులను తయారు చేసుకుంటున్నాయని, ఆ వైపుగా మన పాలకులు ఆలోచించడం లేదని అన్నారు. దక్షిణ కొరియాలో 95 శాతం, జర్మనీలో 75 శాతం, బ్రిటన్‌లో 68 శాతం, చైనాలో 90 శాతం వృత్తి నైపుణ్యం గల వారుంటే మన దేశంలో 5 శాతం మాత్రమే ఉన్నారంటే, ఉపాధి కల్పన పట్ల పాలకుల వైఖరి స్పష్టమవుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 'జాబ్ క్యాలెండర్' ద్వారా నియామకాలు చేపడతామని చెప్పి, ఇప్పటికి ఒక్క పోలీసు తప్ప ఏ ఉద్యోగానికి ప్రకటన లేదని, గ్రూప్-1, గ్రూప్-2, ఎల్‌డీసీ ఉద్యోగాల మాట అటుంచితే కనీసం టీచర్ పోస్టులకు కూడా ప్రకటన లేదని తెలిపారు. గత నాలుగు సంవత్సరాలలో సచివాలయం పోస్టులు తప్ప ఒక్క ఖాళీ కూడా నింపలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అన్ని స్థాయిల్లో ఉద్యోగాలకు ప్రకటన విడుదల చెయ్యాలని, కేంద్ర ప్రభుత్వం వాగ్దానం చేసిన సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకోవాలని, సంవత్సరానికి కోటి మందికి శిక్షణ ఇవ్వాలని వక్తలు డిమాండ్ చేశారు.

మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

విశాలాంధ్ర-విశాఖ: ఎన్నికల ప్రచారంలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తామని హామీ ఇచ్చిన జగన్‌మోహన్ రెడ్డి ... అధికారం చేపట్టి నాలుగున్నరేళ్లయినా ఆ దిశగా ఏ ప్రయత్నం చేయలేదని ఆంధ్ర ప్రదేశ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఆర్ రవీంద్రనాథ్ విమ ర్శించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వీ బాలయ్య అధ్యక్షతన శుక్రవారం ప్రభుత్వ ఛాతీ, అంటువ్యాధుల ఆసుపత్రి సమావేశ మందిరంలో రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రవీంద్రనాథ్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని జగన్ హామీ ఇచ్చారన్నారు. అధికారం లోకి వచ్చి సంవత్సరాలు గడుస్తున్నా ఇంతవరకూ సీపీఎస్ రద్దు చేయలేదని విమర్శించారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొత్తగా ఏర్పాటుచేసిన వైద్య కళాశాలల్లో పోస్టులను రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేయాలని కోరారు. 12వ పీఆర్సీకి ఏడాది సమయం ఉన్నందున మధ్యం తర భృతి చెల్లించాలని డిమాండ్ చేశారు. కరోనా కష్టకాలంలో ప్రజల ప్రాణాలు కాపాడడం కోసం విశేష కృషిచేసిన మెడికల్ ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం శోచనీయమన్నారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.గిరి బాబు మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, 100 శాతం జీతం (బేసిక్ పే, డీఏ., హెచ్‌ఆర్‌ఏ) చెల్లించాలని డిమాండ్ చేశారు. వైద్య విధాన పరిషత్‌లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగు లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, డైటీషియన్‌కు పదోన్నతులు కల్పించాలని, ఎంఎన్ఓ, ఎఫ్ఎన్ఓలకు అడిషనల్ హెచ్‌ఆర్‌ఏ చెల్లించాలని, థియేటర్ అసిస్టెంట్‌లకు పదోన్నతులు కల్పించాలని, ఏపీవీవీపీ ఉద్యోగులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, వైద్య విద్యా విభాగంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుకు పెండింగ్ జీతాలు చెల్లించాలని, అప్కాస్ లో చేర్చి ఉద్యోగ భద్రత కల్పించాలని, లైబ్రేరియన్, నాన్ మెడికల్ అసిస్టెంట్ గెజిటెడ్‌లకు పదోన్నతులు కల్పించాలని, అర్హులైన నాలుగో తరగతి ఉద్యోగులకు జూనియర్ అసిస్టెంట్ పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. పారామెడికల్ సిబ్బందికి యూనిఫాం అలవెన్స్ మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వం ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.బాల రాజు నాయుడు, ఉప ప్రధాన కార్యదర్శి పి.అప్పారావు, యూనియన్ జిల్లా గౌర వాధ్యక్షులు పడాల రమణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు, సత్యనారాయణ, వీ లక్ష్మణ మూర్తి, కోశాధికారి వీ సాయి సత్యనారాయణ పాల్గొన్నారు.

స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ ఎండీగా చంద్రుడు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : సీనియర్ ఐఏఎస్ అధికారి గంధం చంద్రుడు శుక్రవారం రాష్ట్ర స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ ఎండీగా బాధ్యతలు స్వీకరించారు. స్టడీ లీవ్ తర్వాత పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న చంద్రుడుకు ప్రభుత్వం తాజాగా ఈ బాధ్యతలు అప్పగించింది. 2010 బ్యాచ్‌కు చెందిన గంధం చంద్రుడు ఇప్పటి వరకు వివిధ శాఖల్లో కీలక బాధ్యతలను పోషించారు. గిరిజన సంక్షేమ శాఖ కమీషనర్‌గా, అనంత పురం కలెక్టర్‌గా ఆయన చేపట్టిన కార్యక్రమాలు ప్రత్యేకతను చాటుకున్నాయి. స్వచ్ఛ ఆంధ్రా కార్పొరేషన్ లక్ష్యాల సాధనకు కృషి చేస్తానని ఈ సందర్భంగా గంధం చంద్రుడు అన్నారు.

అంగడిలో సరుకుగా వైద్య విద్య : పీడీఎస్‌యూ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన 107, 108 జీవోలతో వైద్య విద్య అంగడిలో సరుకుగా మారిందని పీడీఎస్‌యూ మండిపడింది. ఈ జీవోలను తక్షణమే రద్దు చేయా లని డిమాండు చేసింది. పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రతినిధుల బృందం శుక్రవారం విజయవాడ లోని డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ వి.రాధికారెడ్డికి అందజేసిన వినతి పత్రంలో జీవో రద్దు అంశాన్ని ప్రస్తావించారు. పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ ఎం. రామకృష్ణ, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు యు. గని రాజు, ఎల్. రాజశేఖర్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం 2023-24 విద్యా సంవత్సరం నుంచి విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలలో ఐదు వైద్య కళాశాలలను ప్రారంభించిందన్నారు. ఈ వైద్య కళాశాలల్లో సీట్లను ఏ కేటగిరి కన్వీనర్ కోటా-50శాతం , బి కేటగిరి సెల్ఫ్ ఫైనాన్సింగ్ -35 శాతం, సి కేటగిరి ఎన్ ఆర్ఐ కోటా 15 శాతం. ఇలా మూడు కేటగిరీలుగా వర్గీకరించి ఫీజులను వరుసగా రూ. 15వేలు, రూ.12 లక్షలు, రూ. 20 లక్షలను ప్రభుత్వం నిర్ణయిస్తూ 107,108 జీవోలను జారీ చేసిందన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల్లో ఇప్పటి వరకు 100 శాతం సీట్లను కన్వీనర్ కోటా క్రిందనే భర్తీ చేసే వారని, ప్రస్తుతం బీ, సీ కేటగిరీలుగా మార్చి వైద్య విద్యను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు దూరం చేస్తోందన్నారు. ఇది ప్రతిభగల విద్యార్థులకు నష్టం చేస్తుందన్నారు. వైద్య కళాశాలల స్థాపనకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులిస్తోందని, జాతీయ వైద్య మండలి అనుమతి లేకుండా రాష్ట్ర ప్రభుత్వం బీ, సీ కేటగిరిలుగా చేసి ఫీజులు ఎలా నిర్ణయిస్తుందని ప్రశ్నించారు. వైద్య, దంత కళాశాలల్లో పెంచిన 15 శాతం ఫీజులను తక్షణమే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందిదంచకుంటే విద్యార్థి, యువజన సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం. సునీల్, నాయకులు వైష్ణవ్ పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రను దోచేస్తున్నారు

- ప్రకృతిని ధ్వంసం చేస్తున్నారు
- రుషికొండపై నిర్మాణాలన్నీ అక్రమమే
- వైసీపీ నేతలపై పవన్‌కల్యాణ్ మండిపాటు
- విశాఖలో పవన్ పర్యటనపై అడుగడుగునా ఆంక్షలు

విశాలాంధ్రబ్యూరో-విశాఖపట్నం: ఉత్తరాంధ్ర భూములను వైసీపీ నేతలు దోచేస్తున్నారని జనసేన అధినేత పవన్ కల్యాణ్ మండిపడ్డారు. విశాఖ పర్యటనలో ఉన్న ఆయన శుక్రవారం రుషికొండను పరిశీలించారు. అయితే పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధిస్తూ జనసేనాని సహనాన్ని పరీక్షించారు. మధ్యాహ్నం 3గంటలకు పవన్ రుషికొండకు వెళతారని ఉదయమే షెడ్యూల్ ప్రకటించడంతో అప్రమత్తమైన పోలీసులు పవన్ బసచేసిన నోవాటెల్ వద్ద భారీగా మోహరించారు. తొలుత రుషికొండ పర్యటనకు అనుమతి లేదంటూ పోలీసులు నిరాకరించారు. తర్వాత షరతులతో అనుమతించారు. రుషికొండ పైకి వెళ్లరాదని, రోడ్డుపై నుంచే పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఎట్టకేలకు ఆంక్షల మధ్య రుషికొండను పవన్ పరిశీలించారు. రుషికొండ వద్దకు కాకుండా ఎదురుగా ఉన్న రోడ్డులోకి మాత్రమే వెళ్లాలని పోలీసులు సూచించారు. జోడుగుళ్లపాలెం, విశాలాక్షినగర్, జూపార్కు వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ మూడు ప్రాంతాల్లో ఏసీపీ స్థాయి అధికారిని నియమించి వాహనాలను నియంత్రించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ... "ఉత్తరాంధ్రను దోపిడీ చేస్తున్నారు. రుషికొండపై నిర్మాణాలకు అన్ని అనుమతులు వచ్చాయా? తుపాన్లు వచ్చినప్పుడు ప్రజలను రుషికొండ కాపాడుతుంది. ఉత్తరాంధ్ర భూములు, ఆస్తులపై వైకాపా నేతల కళ్లు పడ్డాయి. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను అడ్డగోలుగా దోచుకుంటున్నారు. తెలంగాణను కూడా ఇలాగే దోచేశారు. అందుకే తన్ని తరిమేశారు. సీఎం జగన్‌కు ఎన్ని ఇళ్లు కావాలి? సర్క్యూట్ హౌస్ తాకట్టు పెట్టి ఇక్కడ నిర్మిస్తాడా? రాష్ట్ర వ్యాప్తంగా దోచేశాడు. విశాఖలో భూ కబ్జాలపై ఉత్తరాంధ్ర ప్రజలు అందరూ దృష్టి పెట్టాలి. రాష్ట్ర ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి. ప్రభుత్వ భూములను తాకట్టు పెట్టేశారు. ప్రైవేట్ భూములను ప్రజల దగ్గర లాక్కుంటున్నారన్నారు. చట్టాల్ని కాపాడాల్సిన ముఖ్యమంత్రి... చట్టాలను ఉల్లంఘిస్తారు. రుషి కొండపై పూర్తిగా నిబంధనలు ఉల్లంఘించి, నిర్మాణాలు చేపట్టారు. శాంతి యుతంగా ఉన్న విశాఖ ప్రజల పై దోపిడీకి తెగబడ్డారు" అంటూ ధ్వజమెత్తారు.

పవన్ కల్యాణ్‌కు నోటీసులు : జనసేన అధినేత పవన్ కల్యాణ్ కు విశాఖ పోలీసులు నోటీసులు ఇచ్చారు. వారాహి యాత్రలో భాగంగా గురువారం జరిగిన సభలో పవన్ కల్యాణ్ రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేశారంటూ అభియోగాలు మోపారు. ఈ మేరకు విశాఖ తూర్పు ఏసీపీ పవన్ కల్యాణ్‌కు నోటీసులు అందించారు. బహిరంగ సభలో పవన్ నిబంధనలు ఉల్లంఘించారని, పవన్ అలా వ్యవహరించి ఉండకూడదని నోటీసుల్లో పోలీసులు పేర్కొన్నారు. మరోపక్క జనసేన అధినేత పవన్ కల్యాణ్ విశాఖ పర్యటన సందర్భంగా టెన్షన్ కొనసాగుతోంది. మరోవైపు ఆయన పర్యటనపై పోలీసులు విచిత్ర ఆంక్షలు విధించారు. జోడుగులపాలెం దగ్గర అందరూ ఆగిపోవాలని ఆదేశించారు. రాడిషన్ బ్లూ హోటల్ దగ్గర పవన్ వాహనానికి మాత్రమే అనుమతి ఇచ్చారు. రుషికొండ దగ్గర రోడ్డుకు కుడివైపున పవన్ వెళ్లకూడదన్నారు. ఎడమ వైపునే వెళ్లాలని పోలీసులు షరతులు విధించారు. కుడివైపున ఉన్న రుషికొండవైపు కాకుండా ఎడమవైపు వెళ్లమనడం ఏంటని జనసైనికులు ప్రశ్నించారు. ఇక రుషికొండ దగ్గర మీడియా సమావేశం పెట్టవద్దని ఆంక్షలు పెట్టారు. గీతం యూనివర్శిటీ దగ్గర మీడియా సమావేశం ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు ఆదేశించారు. పోలీసుల తీరుపై జనసేన నేతలు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రుషికొండ ఏమైనా నిషేధిత ప్రాంతమా అని జనసేన నేతలు ప్రశ్నిస్తున్నారు. భావ ప్రకటన స్వేచ్ఛ, ప్రాథమిక హక్కులపై ఆంక్షలు, రాజ్యాంగ ఉల్లంఘన కిందకు వస్తాయని జనసేన న్యాయవాదులు చెబుతున్నారు.

సంపాదకీయం

మోదీ తెంపరితనం

సుప్రీంకోర్టు అంటే మోదీ సర్కారుకు ఎంత వ్యతిరేకత ఉందో ఇటీవలి కాలంలో రెండోసారి రుజువు అయింది. ఎన్నికల కమిషనర్లను నియమించడానికి ఉద్దేశించిన కమిటీలో ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉండాలని అయిదుగురు సభ్యులతో కూడిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా ఇచ్చిన తీర్పును తోసిపుచ్చాలని మోదీ సర్కారు నిర్ణయించింది. దీనికోసం పార్లమెంటులో బిల్లు ప్రతిపాదించనున్నారు. రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పుచెప్పడం అంటే దానికి శాసనప్రతిపత్తి ఉంటుంది. కానీ శాసనాలను అడుగడుగునా బేఖాతర్ చేయడంలో తెంపరితనం ప్రదర్శిస్తున్న మోదీ సర్కారు ప్రతిపాదించబోయే కొత్త బిల్లులో ప్రధాన న్యాయమూర్తికే స్థానంలేకుండా చేయాలని నిర్ణయించింది. దిల్లీ పాలనాధికారాలు ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రివే అని సుప్రీంకోర్టు తీర్పుచెప్తే అది చెల్లకుండా చేయడానికి మోదీ సర్కారు మొదట ఆర్డినెన్సు జారీచేసి ఆ తరవాత బిల్లు ప్రతిపాదించి ఆమోదింపచేసుకుంది. ఎన్నికల కమిషన్ ప్రధానాధికారిగా అరుణ్ కుమార్ గోయల్‌ను నియమించడానికి కేంద్ర ప్రభుత్వానికి 24 గంటల సమయంకూడా పట్టలేదు. ఈ హడావుడిపై అనేక విమర్శలు తలెత్తాయి. అప్పుడే సుప్రీంకోర్టు ముగ్గురుసభ్యుల కమిటీ ఉండాలనడంతోపాటు అందులో ప్రధానమంత్రి, ప్రతిపక్ష నాయకుడు, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఉండాలని తీర్పు చెప్పింది. ఆ రాజ్యాంగ ధర్మాసనంలో ప్రధాన న్యాయమూర్తి లేరు. న్యాయమూర్తులు కె.ఎం.జోసఫ్, అజయ్ రస్తోగి, అనిరుద్ బోస్, రిషికేశ్ రాయ్, కుమార్ ఉన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్ర చూడ్ అంటే బీజేపీ సర్కారుకు కంపరం. ఆయనను లొంగదీసుకోవడానికి చేసిన ప్రయత్నాలు ఏవీ సఫలం కాకపోవడంతో మోదీ సర్కారు ఇరకాటంలోపడింది. ఇప్పటిదాకా ప్రభుత్వ సిఫార్సు ఆధారంగా రాష్ట్రపతి ఎన్నికల ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను, మిగతా ఇద్దరు కమిషనర్లను నియమిస్తున్నారు. ఈ నియామకానికి ఇన్నాళ్లుగా చట్టం ఏమీలేదు. అయితే ఈ అంశంపై పార్లమెంటు బిల్లు తీసుకురావచ్చునని అత్యున్నత న్యాయస్థానం తెలియజేసింది. ఈ మాట ఆసరాగా మోదీ సర్కారు ప్రధాన న్యాయమూర్తికే ఆ కమిటిల్లో సభ్యత్వంలేకుండా చేసే రీతిలో బిల్లు ప్రవేశపెట్టనుంది. అదేమంటే కొత్త చట్టం తీసుకు రావొచ్చునని మీరే చెప్పారుగా అని దబాయించడం మోదీ సర్కారు ఎత్తుగడ. కేంద్రప్రభుత్వ ఆలోచన ప్రకారం ఈ కమిటీలో ప్రధాని, ప్రతిపక్ష నాయకుడితో పాటు ఒక కాబినెట్ మంత్రి ఉంటారట. ఆ కాబినెట్ మంత్రిని ఎటూ ప్రధానమంత్రే నామినేట్ చేస్తారు. ఇక ఎదురే ఉండదు. అంటే తమ ఇష్టానుసారం ఎన్నికల కమిషనర్లను నియమించడానికి కేంద్ర ప్రభుత్వం మార్గం సుగమంచేస్తోంది. ఎన్నికల కమిషనర్లను, ముఖ్యంగా ఎన్నికల కమిషన్ ప్రధానాధికారిని ప్రధానమంత్రే నియమిస్తే ఆయన ప్రభుత్వాన్ని ఎలా ప్రశ్నించగలరు అని సుప్రీంకోర్టు సందేహం వెలిబుచ్చింది. ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ సుప్రీంకోర్టు ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పులు చెప్పడానికి వెనుకాడడం లేదు. చంద్రచూడ్ మోదీ సర్కారుకు కంటిలో నలుసులా తయారయ్యారు. మోదీ ప్రభుత్వం నిరంకుశంగా మారకుండా సుప్రీంకోర్టు అంకుశం ఉపయోగిస్తోంది. సుప్రీంకోర్టు నిర్దేశించడం మోదీ సర్కారుకు అసలే మింగుడు పడలేదు.

మార్చి రెండున సుప్రీంకోర్టు తీర్పు వెలువడితే ఆరునెలలుగా నోరు మెదపని మోదీ సర్కారు ఇదే అదును అని కొత్త చట్టం ప్రస్తావన తీసుకొచ్చింది. ఆ త్రిసభ్య కమిటీలో ప్రధాన న్యాయమూర్తి కూడా ఉంటే, మరో సభ్యుడు ప్రతిపక్ష నాయకుడైతే తాము కోరుకున్న వ్యక్తిని లేదా తమకు అనుకూలంగా ఉండే వ్యక్తులను కమిషనర్లుగా నియమించడం కుదరదని ప్రభుత్వానికి అర్థం అయినందువల్లే కొత్త బిల్లు గురించి మాట్లాడుతోంది. సుప్రీంకోర్టు సూచించిన కమిటీయే ఉంటే అందులో ఉండే ప్రతిపక్ష నాయకుడు, ప్రధాన న్యాయమూర్తి ప్రభుత్వ ప్రతిపాదనను వ్యతిరేకిస్తే తమ ఆటలు సాగవని మోదీ సర్కారుకు తెలుసు. అందుకే ఏకంగా ప్రధాన న్యాయమూర్తికి స్థానం లేకుండా చేయాలని ప్రభుత్వం భావించింది. అనేక ముఖ్యమైన పదవుల నియామకంలో ప్రధానమంత్రి, కేంద్ర హోం మంత్రి, ప్రతిపక్ష నాయకుడు ఉంటారు. అప్పుడు మొగ్గు ప్రభుత్వపక్షం వేపే ఉంటుంది. దానికి అనుగుణంగానే కొత్త బిల్లుకు రూపకల్పన జరుగుతోంది. అనేక రాజ్యాంగ వ్యవస్థలను మోదీ సర్కారు తమకు అనుకూలంగా మార్చుకుంది. మార్చుకోవడం అసాధ్యమైనప్పుడు లొంగదీసుకుంది. కానీ ఎన్నికల కమిషన్ రాజ్యాంగ వ్యవస్థ. ఎన్నికల నిర్వహణలో, ఓటర్ల జాబితా తయారు చేయడంలో, ఎన్నికల కార్యక్రమాన్ని ప్రకటించడంలో రాజ్యాంగ నిర్దేశం ప్రకారం ఎన్నికల కమిషన్‌కు సర్వాధికారాలు ఉంటాయి. ప్రజాస్వామ్యంలో ఓటుకున్న శక్తి అపారం. ఎంత బలమైన ప్రభుత్వాన్ని అయినా అవకాశం వచ్చినప్పుడు ప్రజలుగద్దె దించగలరు. ఇంతకన్నా ఎక్కువ మెజారిటీ ఉన్న సమయంలో కూడా ఎన్నికలలో ఆ ప్రభుత్వాలు ఓడిపోయిన ఉదంతాలు ఉన్నాయి. ఎన్నికల కమిషన్ వ్యవస్థకే వెన్నెముక లేకుండా చేయడమే మోదీ సర్కారు లక్ష్యం. అప్పుడు ఎన్నికల కమిషన్ నామమాత్రంగా మిగిలిపోతుంది. రాజ్యాంగ నిర్దేశానికి విలువలేకుండా పోతుంది. మోదీ ప్రభుత్వానికి కావలసిందే ఇది. ప్రస్తుతం ఉన్న ఎన్నికల కమిషన్ కోరలను మోదీ సర్కారు ఎప్పుడో పెరికి వేసింది. ఇదే విధానం కొనసాగించడమే అసలు లక్ష్యం. ఎన్నికల కమిషనర్ల నియామకం గురించి సుప్రీంకోర్టు అనేక ప్రశ్నలు లేవనెత్తింది. వాటికి ప్రభుత్వం జవాబివ్వకుండా ప్రధాన న్యాయమూర్తి పాత్ర లేని కమిటీని ఏర్పాటు చేయడానికి సన్నద్ధం అయింది. ఈ ఏడాది ముగిసేలోగా మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరం, తెలంగాణ శాసన సభలకు ఎన్నికలు జరగవలసి ఉంది. వచ్చే ఏడాది మేలోగా సార్వత్రిక ఎన్నికలు జరగాలి. అయిదు రాష్ట్రాల శాసనసభల ఎన్నికలు బీజేపీకి దాదాపు జీవన్మరణ సమస్య. ఇందులో రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్ ఏలుబడిలో ఉన్నాయి. ఈ రెండు రాష్ట్రాలలోనే కాక మధ్యప్రదేశ్‌లోనూ బీజేపీకి ఎదురుగాలే ఉంది. అలాంటి తరుణంలో ఎన్నికల కమిషన్ తమకు అనుకూలంగా వ్యవహరించాలని బీజేపీ తాపత్రయ పడ్తోంది. ప్రభుత్వానికి అనుకూలంగా నడుచుకునే ఎన్నికల కమిషనర్లు ఉంటే పరిస్థితి సహజంగానే ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటుంది. మోదీకి కావలసింది సరిగ్గా అదే. రాజ్యాంగ నిర్దేశాలు గాలికి కొట్టుకుపోయినా ఆయన లక్ష్యపెట్టరు. సుప్రీంకోర్టు నిర్దేశం తమకు అనుకూలంగా లేదనుకున్నప్పుడు మోదీ కొత్త చట్టం రూపొందిస్తారు. నియామక కమిటీలో ప్రధాన న్యాయమూర్తి ఉన్నంత మాత్రాన ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా, స్వేచ్ఛగా పని చేస్తుందనుకోలేం అని విచారణ సందర్భంగా ప్రభుత్వం వాదించడమే అత్యున్నత న్యాయస్థానం అంటే మోదీ సర్కారుకు ఎంత వెగటో రుజువు చేస్తోంది.

ఆ ఆయుధాలు కన్నీరు కారుస్తున్నాయి...

ఇంతా చేసి ఇదంతా గద్దర్ గురించి కాదు. ఆరు దశాబ్దాల పాటు మరో చేయిలా ఆయన భుజానికి అతుక్కుపోయిన ఆ కర్ర, దానికి కట్టిన ఆ జెండాల గురించి. కన్నీరు కార్చడానికి, పక్కవారితో చెప్పుకుందుకు మనకి నోరు ఉంది. కళ్లూ ఉన్నాయి. ఆ భుజాలపై వాలి కునుకుతీసిన ఆ కర్ర, అంతలోనే తుపాకిగామారి ఆ రెండు చేతుల నుంచి గురిపెడుతున్న ఆ కర్ర జెండా గురించే నా బాధంతా. ఆయన భుజాల మీంచి గుండెలపై కప్పుకుని ఓ ధైర్యాన్ని పొందిన ఆ ఎర్రంచు నల్లటి కంబళి గురించే నా వగపంతా. ఇప్పుడు ఆ కంబళి ఎవరిని అక్కున చేర్చుకుంటుందా అనే నా వేదనంతా. గజ్జెలదీ ఇదే బాధ. "వినండి జనం గుండెల చప్పుడు" అంటూ ఆకాశం దిగి వచ్చేలా లక్షలాది మంది గుండె చప్పుళ్లు వినిపించిన ఈ గజ్జెలకి ఎంత కష్టం వచ్చింది. నా బాధంతా గద్దర్ గురించి కానే కాదు....రాగాన్ని, ప్రాణాల్ని, ఆదివాసీల బతుకు పోరాటాలని చెప్పడం ఎలా...అని వెక్కిళ్ల మధ్య భోరున ఏడుస్తున్న జనంపాట గురించే నా ఆవేదనంతా. ఆయనకేం. మహా వాగ్గేయ

చక్రవాకం

- ముక్కాము చక్రధర్

కారుడు కదా. గుప్పెడు పాటల్నీ, గంపెడు ధైర్యాన్నీ ఇచ్చి ఎక్కడ నుంచి వచ్చాడో ఆ గంధర్వలోకానికి పయనమయ్యారు. తాను జీవించినంతకాలం తన ఆభరణాలుగా ధరించిన ఆ ఆయుధాల గురించే నా కన్నీరంతా. నాలుగు డబ్బులు వెనుకేసుకుంటున్న కాలం ఇది. ఇళ్లు, స్థలాలు, పొలాలు, బంగారం, షేర్ మార్కెట్ల లావాదేవీలు, లగ్జరీ కార్లు, ఫాం హౌస్‌లు... ఇలా సకల సంపదలను ఇనపెట్టెల్లోను, కాగితాల మధ్య కాపుకాసుకుంటున్న కలికాలం. ఈ కాలంలో బుల్లెట్లను వెనుకేసుకున్న ఏకైక వాగ్గేయకారుడు ఈ గద్దర్. ఆయన గానం విన్న లక్షలాది వేదికలు ఇప్పుడు ఎవరి పాటలు వింటాయో అన్నదే నా భయం. భుజాన వేసుకున్న ఆ ఎర్రటి అంగవస్త్రం పం పిల్లలా ఆయన పొత్తిళ్లలో వొదిగి కన్నీరు కారుస్తూ "మీరు కాకమ్మలై వస్తారా... మా కూనలు... మా కడుపు తీపి చూసి పోతారా... మా బిడ్డలు" అంటూ అమరులను తనఒడిలోకి ఎత్తుకుని కన్నీరు కార్చిన గద్దర్ గురించి కాదు నా బాధంతా. అదిగో ఆయన చేతుల్లో పసిపిల్లాడి అవతారం ఎత్తి ప్రాణమున్నట్లుగా భ్రమించే ఆ గుడ్డముక్క గురించే నా ఈ నా వేదనంతా. పాట మధ్యలో "హ... హు" అన్న ఆ గద్దర్ పిలుపులాంటి అరుపునకు జడుసుకున్న మైకులో నాకెందుకో ఏలికల భయం వినపడుతుంది.

అజ్ఞాతంవీడి జన సమూహంలోకి వచ్చినప్పుడు జనసంద్రమైన ఆ నిజాం కళాశాల మైదానం " బిడ్డా... నా గద్దరా.... నన్ను మనుషులతో... అచ్చమైన మానవులతో మరోసారి నింపకుండా ఏడకు పోయినావు కొడకా" అని ఆ భూతల్లి అడుగు తోందనిపిస్తోంది. నువ్వు పుట్టుమచ్చ అవుతానంటే మురిసి పోయాను కానీ, ఆ మచ్చను మాకు వదిలేసి శాశ్వతంగా వెళ్లిపోతానంటే ఆ పుట్టుమచ్చను అగ్గితో చెరిపేసుకుందును అన్నా అని ఆ చెల్లెలు రోదిస్తు న్నట్టుగానే ఉంది. ఖాకీలంకదా...ఉద్యోగం ధర్మం. ఆకలేసే కడుపు, మమ్మల్ని నమ్ముకున్న మా కుటుంబం. అందుకే నీ మీద లాఠీ విసిరిఉంటాం.... దయా మయుడిలా మమ్మల్ని కరుణించి మా కష్టాల్ని మాకే చెప్పి " నాసా కింద, మీసా కింద నిన్ను జైల్లో బెట్టినారు... నీకు నాకు తేడా లేదన్నో.. ఓ పోలీసన్న...పోరు తప్ప దారి లేదయ్యో ఓ పోలీసన్నా... కొట్టుడు కాద, తిట్టుడు కాద, తన్నుడు కాద... అన్నింటికి ముందునుంటవో ఓ పోలీసన్నా... ఆకలితో సస్తావెందుకో ఓ పోలీసన్నా..." అన్నందుకు ఆ గంజి పెట్టిన ఖాకీవనం వలవల ఏడుస్తూనే ఉండి ఉంటుంది.

ఈ మధ్య మారిన లేదూ మారారని అనుకుంటున్న గద్దర్ గురించి చాలా మంది చాలా వ్యాఖ్యానాలు చేస్తున్నారు. వేలాది మందిని అడవిబాట పట్టించి ఆయన మాత్రం ఇలా... అంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ఓ పెళ్లికి వెళ్లిన ఇలాంటి వాళ్లు అక్కడి ఏర్పాట్లను చూసి ఆనందించి... సంతృప్తిగా విందు భోజనంతిని, వాళ్లిచ్చిన కిళ్లీ నములుతూ "ఇక్కడన్నీ బాగున్నాయి.... కానీ ఆ పెళ్లి కూతురుకి మెల్లకన్ను" అని బ్రేవ్ మంటూ మాట్లాడుతున్నారు. విప్లవోద్యమంలోకి వెళ్లమంటూ గద్దర్ కాని, మరొకరు కాని ఎవ్వరికి హితబోధ చేయలేదు. దేశంలో, ఆ మాటకొస్తే ప్రపంచంలో జరుగుతున్న పరి స్థితులను తెలియజేశారు. లక్షలాదిమంది ఆ పాటల్ని విన్నారు. గద్దర్‌కి వీరా భిమానులయ్యారు. ఆ పాటలువిన్న తర్వాత చిరంజీవి నటించిన సినిమాల్లోని పాటలూ విన్నారు. గద్దర్ మీటింగ్‌కి వచ్చినట్లుగానే ఆ వ్యర్థజీవులంతా ఓ మ్యాటీ చూసి పోయారంతే. ఈ రెంటికి మధ్య తేడా వారికి కనిపించలేదు. ఎవరుఎలాపోతే మనకెందుకు...మనకుటుంబం బాగుంటే చాలు అనుకున్నారు. గద్దర్ పాటలు విన్న కోట్లాదిమందిలో అతి తక్కువమంది మాత్రమే విప్లవం బాట పట్టారు. గద్దర్ అయినా, వంగపండు అయినా, సుబ్బారావు పాణిగ్రాహి అయినా, విమలక్క అయినా "బాబోరే ఇలాఉందిరా ప్రజల జీవితం" అనే చెప్తారు. నిజానికి ఆ పాటలు విన్నవారంతా విప్లవోద్యమం వైపు పరుగులుతీస్తే దేశంలోనేకాదు.... ప్రపంచంలో ఏ దేశంలోనైనా విప్లవం అరనిమిషంలో వచ్చేస్తుంది. కేవలం ప్రజల పాటలువిని విప్లవంకోసం పోరాడడమంటే సినిమాల్లో హీరో రిక్షా తొక్కి చెల్లెల్ని అంబానీ కొడుక్కిఇచ్చి పెళ్లి చేసినట్లు కాదు. సరిగ్గా నెల క్రితం గద్దర్ మా అంబేద్కర్ కోనసీమ జిల్లాకువస్తే వృత్తిలోభాగంగా ఇంటర్వ్యూచేసారు. నన్ను మా ఊర్లో చూసి ఆశ్చర్యపోయిన గద్దర్ ఎప్పటిలాగే ఆప్యాయంగా కౌగలించుకుని.. "చక్రి.. ఎలా ఉన్నావు" అన్నారు. ఇద్దరం కోనసీమ వెతలగురించి రెండు గంటలు మాట్లాడుకున్నాం. ఆమాటలు నన్నువిప్లవంలోకి తీసుకెళ్లలేదు కానీ... మనుషుల గురించి, ముఖ్యంగా పీడితుల గురించి ఆలోచించరా భయ్ అన్నట్లుగా ఉన్నాయి. ఏడుపదుల జీవితంలో గద్దర్ అదేచెప్పారు. అదేచేసారు. అవునూ...ఏరంగంలోఉన్నవారి వారసత్వం ఆరంగంలోనే ఉండాలా. రవీంద్ర నాథ్ ఠాగూర్ సంతానం కవిత్వంరాసారా... షేక్స్పియర్ వారసులు నాటికలు అల్లారా. గురజాడ మునిమనమలు ఏంచేస్తున్నట్లు... గద్దర్ తాత గారు ఏంచేసేవారు...సృజన వారసత్వంకాదు. సినిమాల్లోనూ, రాజకీయా ల్లోనూ వారసత్వాన్ని చూస్తున్నాంకదా..ఇంకా ఈ మధ్యతరగతి ముసుగులెందుకు....

సీనియర్ జర్నలిస్టు, 99120 19929

పోరాటంలో అగ్రభాగాన నిలిచిన ఏఐఎస్ఎఫ్

నక్కి లెనిన్ బాబు

స్వాతంత్ర్యం మా జన్మ హక్కు అంటూ సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం జరిగిన సంగ్రామంలో ఉద్యమించిన ప్రథమ విద్యార్థి సంఘం అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్). ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రేమ్ నారాయణ భార్గవ్ బద్రుద్దీన్, తదితర విద్యార్థి నాయకులు విద్యార్థులను ఐక్యం చేసేందుకు 1936, ఆగస్టు 12న ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నో నగరంలో జరిగిన ఏఐఎస్ఎఫ్ సభకు ఎమ్మెల్యే జిన్నా అధ్యక్షత వహించగా, ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభోత్సవంచేస్తూ నేటి విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న మార్పులు గమనిస్తూ భారత దేశంలో బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో అగ్రభాగాన నిలవాలని పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావసభ సందర్భంగా మహాత్మా గాంధీ, సరోజినీ నాయుడు, అనేకమంది స్వాతంత్ర్య సమరయోధులు స్వాతంత్ర్య పోరాటంలో అగ్రభాగాన ఉండేందుకు సిద్ధం కావాలని సందేశం పంపించారు. ఏఐఎస్ఎఫ్ ఏర్పాటు కోసం జరిగిన సభకు హాజరయ్యేందుకు దేశవ్యాప్తంగా వందలాదిమంది విద్యార్థులు పాల్గొన్నారు. శాంతి, అభ్యుదయం, శాస్త్రీయ విద్యా విధానం లక్ష్యాలుగా దేశ స్వాతంత్ర్య ప్రథమ అజెండాగా ఈ మహాసభ పిలుపునిచ్చింది. వివిధ రూపాల్లో జరుగుతున్న స్వాతంత్ర్య పోరాటంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య విద్యార్థులను చైతన్యంచేస్తూ స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వామ్యానికి కృషి చేసింది. స్వాతంత్ర్యంకోసం పోరాడి జైల్లో మగ్గుతున్న స్వాతంత్ర సమరయోధులను రాజకీయ ఖైదీలుగా గుర్తించాలని, వారికి సరైన సౌకర్యాలు కావాలని పోరాడింది. దేశ స్వాతంత్రం కోసం పోరాడిన హిందుస్తాన్ సోషలిస్ట్ రిపబ్లిక్ అసోసియేషన్ నాయకులు భగత్‌సింగ్, సుఖదేవ్, రాజ్‌గురులను బ్రిటిష్ ప్రభుత్వం 1931, మార్చి 23వ తేదీన ఉరిశిక్ష అమలుచేసింది. భౌతికంగా మమ్మల్ని చంపగలరు కానీ మా ఆశయాలు చంపలేరు మా ఆశయ సాధన కోసం భారతదేశ విద్యార్థి యువకులు మా ఉద్యమాన్ని కొనసాగిస్తారని ఇచ్చిన పిలుపును అఖిల భారత విద్యార్థి సమాఖ్య తన భుజాలపై వేసుకొని వివిధ రాష్ట్రాల్లోని విద్యార్థులను సంఘటితం చేస్తూ పోరాడింది. మహాత్మాగాంధీ క్విట్ ఇండియా ఉద్యమానికి పిలుపునిస్తే వేలాదిమంది విద్యార్థులను సమీకరించి ఆ ఉద్యమంలో భాగస్వామి చేయడంలో కీలకపాత్ర వహించిన సంఘం ఏఐఎస్ఎఫ్. భారత రాజ్యాంగం ప్రకారం పౌరహక్కులు విద్యా, వైద్య, ఉపాధి, ఉద్యోగాలకోసం పోరాటాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఆనాడు ముంబైలో కార్మికుల నిర్వహించిన సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపింది. దేశవ్యాప్తంగా స్వతంత్ర పోరాటంలో పాల్గొనాలన్న బాధ్యతను గుర్తుచేస్తూ కరపత్రాలు ముద్రించి దేశ నలమూలలకు పంపిణీ చేసింది. భారతదేశ స్వాతంత్ర్యం అనంతరం 1945 ఆగస్టు 15 తేదీన హైదరాబాదు నగరంలో నిజాం ప్రభుత్వం జాతీయ జెండా ఆవిష్కరణకు అనుమతి నిరాకరించడంతో హైదరాబాదు నగరంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు కేశవ మెమోరియల్ స్కూల్‌లో జాతీయ జెండాను ఎగరవేశారు. ప్రపంచ యువజన సమాఖ్య, అంతర్జాతీయ విద్యార్థి సమాఖ్య అనుబంధంగా ఏఐఎస్ఎఫ్ కొనసాగుతుంది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న వివక్షకు, అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పోరాటాలు చేపట్టింది. దేశంలో ఉపాధి హక్కులకోసం పోరాటాలు చేసింది. ఖలిస్తాన్ పేరుతో పంజాబ్‌లో దేశ విభజన కోసం కుట్రలు చేస్తున్న నేపథ్యంలో ఖలిస్తాన్ ఉద్యమానికి వ్యతిరేకంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు సత్యపాల్ డాంగ్ నాయకత్వంలో పెద్ద ఎత్తున పోరాటం చేపట్టారు. విద్యారంగ సమస్యల కోసం సమరశీల పోరాటాలు నిర్వహిస్తూ దేశంలో వరదలు, భూకంపాలు, కరువులు వచ్చినప్పుడు సామాజిక బాధ్యతగా ప్రజలను ఆదుకునేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహించారు. గుమస్తాలను తయారుచేసే బ్రిటిష్ వారు ప్రవేశపెట్టిన మెకాలే విద్యావిధానం మాకొద్దంటూ విద్యారంగంలో సంస్కరణల కోసం పోరాడింది. కొఠారి కమిషన్ సిఫారసుల అమలుచేసి కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లో అధిక నిధులు కేటాయించి విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలని కోరింది.

వ్యవస్థాపక దినోత్సవం నాడుతీసిన ఫొటో

నేడు ఏఐఎస్ఎఫ్ 88వ వార్షికోత్సవం

మేధావులను తయారుచేసే విశ్వవిద్యాలయాలను అభివృద్ధి చేయాలని పరీక్ష విధానంలో సంస్కరణల కోసం ఉద్యమించింది. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అంటూ పోరాటం సాగుతున్న నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీ కేంద్రంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు స్టీల్ కమిటీ పేరుతో అనేక ఉద్యమాలు నిర్వహించి విజయం సాధించారు. పాఠశాల విద్యలో మార్పులకోసం పోరాడుతూ సంక్షేమ హాస్టల్లో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం కోసం ఉద్యమించింది. కొఠారి కమిషన్ సిఫారసు విరుద్ధంగా విద్యారంగంలో చేసిన సవరణలకు వ్యతిరేకంగా శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ కేంద్రంగా ఉద్యమించి విజయం సాధించింది. బీకాం చదువుతున్న విద్యార్థులకు బిఈడి అవకాశంలేదని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తే దానికి వ్యతిరేకంగా ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులపై లాఠీచార్జి చేసినా మొక్కవోని ధైర్యంతో పోరాడి బీకాం విద్యార్థులకు బిఈడి చేసే అవకాశాన్ని సాధించింది. ధరలు కనుగుణంగా విద్యార్థుల మెస్‌చార్జీలు, స్కాలర్ షిప్‌లు పెంచాలని పోరాడింది. మహిళలపై జరుగుతున్న దాడులకు, అశ్లీల సాహిత్యానికి వ్యతిరేకంగా పోరాటం సాగిస్తున్నది. ఆంధ్రప్రదేశ్‌లో వెనుకబడిన రాయలసీమ జిల్లాలకు కృష్ణా జలాలను మళ్లించాలని పోరాడిన ఘనత ఏఐఎస్ఎఫ్‌దే. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన అనంతరం విభజన హామీల అమలు కోసం రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులను చైతన్యం చేస్తూ పోరాటం సాగిస్తోంది. వెనుకబడిన ఉత్తరాంధ్ర రాయలసీమ జిల్లాల అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు, జాతీయ పోలవరం ప్రాజెక్టు, రాజధాని, జాతీయ స్థాయి విద్య, వైద్య సంస్థల నిర్మాణానికి నిధులు ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్ పోరాడుతోంది.

మరో ఉద్యమానికి సిద్ధం కావాలి

పరాయి పాలనకు వ్యతిరేకంగా సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం పోరాడి సాధించుకున్న స్వాతంత్ర్య ఫలాలు నేటి పాలకుల విధానాల వల్ల కార్పొరేట్ వ్యక్తులకు అందుతున్నాయి. మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యారంగంలో సంస్కరణల పేరుతో జాతీయ విద్యావిధానం ఎన్ఈపి విద్యను కాషాయీకరణ చేసేందుకు కుట్ర చేస్తున్నారు. మతాలు, ప్రాంతాల మధ్య ఘర్షణలు పెడుతున్నారు. యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని తగ్గించి అభివృద్ధికి నిధులు కేటాయించడం లేదు. ప్రభుత్వరంగ సంస్థలు రైల్వే, విమానాశ్రయాలు, ఓడరేవులు, గ్యాస్, ఆయిలు, స్టీల్ ప్లాంట్‌లను అదానీ, అంబానీలకు అప్పగించేందుకు వ్యతిరేకంగా, రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను ఎత్తి వేయాలని మోదీ ప్రభుత్వ కుట్రకు వ్యతిరేకంగా విద్యార్థి, యువకులు దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధం కావాల్సిన అవసరం ఉంది. వేలాదిమంది త్యాగాలు, బలిదానాల ద్వారా సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని భగ్నం చేస్తూ మోదీ ప్రభుత్వం పనిచేస్తోంది. విద్యార్థుల భవిష్యత్తు కాపాడాలంటే సంఘటిత పోరాటమే ఏకైక మార్గం. స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, అల్లూరి సీతారామరాజు, ఝాన్సీ లక్ష్మీబాయి వంటి వారి ఉద్యమ స్ఫూర్తి నేటి యువతకు ఆదర్శం కావాలి.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

నాడు శ్రీశ్రీ నేడు గద్దర్

డాక్టర్ కె. నారాయణ
సీపీఐ జాతీయ కార్యదర్శి

"1930 వరకు తెలుగు సాహిత్యం నన్ను నడిపిస్తే, 1930 నుండి తెలుగు సాహిత్యాన్ని నేను నడిపించాను. కవిత్వంలో ఇది నా యుగం" అన్నాడు శ్రీశ్రీ. గద్దర్ ఇది నా శకం అనలేదు కానీ ప్రజల పోరాబాటలో గద్దర్ తన పాట, ఆటలతో గద్దర్‌కు ముందు, గద్దర్ తరువాత అన్న ముద్ర బలంగా వేశాడనే నా భావన. దీనిని ఎవరు అంగీకరించినా, వ్యతిరేకించినా వచ్చే నష్టమే లేదు. దేనికి పనికి రాని ఓ జంతువునైనా, మనిషినైనా వాటి జీవితం వృథా అనుకుంటాం. ఇది సహజం. మనిషిలో ఉండే కరుణ మానవత్వాలకు నిదర్శనం. నాగరికలోకంలో ఉన్నామను కుంటూ, చావును కూడా తూర్పారబట్టే అనాగరికులు కూడా మన మధ్యే ఉంటారని తాజాగా తెలుసుకున్నాం. అంతులేని నిర్బంధాలు, రాజ్యహింస చవిచూసి, ఎమర్జెన్సీ ఎత్తివేసిన అనంతరం వామపక్షాలతోపాటు, రాడికల్స్ కూడా బహిరంగ సభలు, సమావేశాలు పెట్టుకునే అవకాశం వచ్చింది.

ఈ నేపథ్యంలో తిరుపతి కోనేటికట్టలో జరిగిన బహిరంగసభలో త్రిపురనేని మధుసూదనరావు ఉపన్యాసం, గద్దర్ పాట, ఆట శ్రోతల్లో ఒక ఊపు తీసుకువచ్చాయి. అప్పటికే నేను సీపీఐ పార్టీ తరపున తిరుపతిలో విద్యార్థి, యువజనోద్యమ బాధ్యుడుగా పని చేస్తున్న రోజులు. మొదటిసారిగా త్రిపురనేని మధుసూదనరావు, గద్దర్ ద్వయాన్ని ఆ సభలో చూశాను. త్రిపురనేని మధుసూదనరావు తిరుపతి గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. విరసంలో ప్రముఖ పాత్ర త్రిపురనేనిది. వారి స్వరం ధీర గంభీరం, వారి ఉపన్యాసాన్ని పశు పక్ష్యాదులు కూడా చెవులు రిక్కించి వింటాయన్నట్లుండేది. అగ్నికి ఆజ్యం తోడైనట్లు గద్దర్ ఆటా పాటలతో యువతకు ఉత్తేజం, సామాన్యులకు విప్లవ సందేశం, మేధావులకు మేధోమథనం, కళాకారులకు "కళ కళ కోసం కాదు, ప్రజల కోసం" అన్న ఆలోచన కలుగజేస్తూ, ఉభయులు ప్రేక్షకులకు కాచివడపోసిన చురుకు పుట్టించే 'విప్లవ అరుకు' తాగించి పంపించేవారు.

అప్పటి నుండి గద్దర్ నాకు తెలుసు కానీ, గద్దర్‌కు నేను తెలియదు. నేను సీపీఐ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టాక గద్దర్‌తో ప్రత్యక్ష సంబంధాలు ఏర్పడ్డాయి. నన్నెప్పుడూ ప్రోత్సహించేవాడు. ఉద్యమ నేపథ్యంలో కొన్ని సందర్భాలలో వివాదాలు నాతోపాటు పయనించేవి. ఆ విమర్శలనెదుర్కొనే క్రమంలో గద్దర్ మాత్రం "ఏయ్ నారన్నా మనిద్దరం అంతే. నువ్వు ముందుకు పో" అని వెన్నుతట్టి ప్రోత్సహించేవాడు. సీపీఐ కూడా ప్రత్యేక తెలంగాణవాదాన్ని బలపరిచాక, ఉద్యమంలో కలిసి పాల్గొన్నాం. తెలంగాణలోని కోల్‌బెల్ట్ ఏరియాలో అనేక బహిరంగ సభలలో వేదిక పంచుకున్నాం. తెలంగాణ ఏర్పాటు తరువాత ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై కలిసి పోరాటంచేశాం. ప్రతి సందర్భంలో ప్రజలకు ఆత్మీయంగా వారి పద్ధతిలో పరిచయం చేసేవాడు.

మహబూబాబాద్ సభకు యువకుడిలా సూటుబూటు వేసుకుని, మంచి గెటప్‌లో వచ్చాడు. వారిని ఆ గెటప్‌లో చూసి, ' గద్దరన్నా నీకు మంచి పిల్లను చూసి లగ్గం చెయ్యాలె' అన్నా. నవ్వుకుంటూ నీదే ఆలస్యం, అలాగే చూడే అని హాస్యమాడాడు. ఎక్కడన్నా కనబడితే నారన్నా నాకు పెండ్లెప్పుడే అని సరసమాడేవాడు.

గద్దర్‌లో విప్లవ భావాలతోపాటు, సరదాగా సరసంగా మాట్లాడటంలో వారికే వారే సాటి. గద్దర్ రాజకీయ జీవితంలో వివాదాలు కూడా వారివెంటే నడిచాయి. నక్సల్స్ ఉద్యమంలో విభేదాలతో బయటకు వచ్చినా, వారి మౌలిక విధానాలను వదిలిపెట్టలేదు. ఎవరేమన్నా గద్దర్ కలం, గళం, కరచరణాలు ప్రజల ప్రయోజనార్థమే. ఎన్ని వివాదాలకు లోనైనా, వారు నమ్ముకున్న కళకు కళంకం రాకుండానే కాపాడుకున్నారు. ఆ నిబద్ధతతోనే వారి చివరిశ్వాస వరకూ వారి ఆట, పాటను ఉన్నతస్థాయిలోనే ఉంచి శాశ్వతంగా సమాజ హితానికి వదిలి, శారీరకంగా మనల్ని వదలి వెళ్ళారు.

సాయుధ పోరాటం, ఎన్నికల బహిష్కరణ వాదాలను సమర్థించినా చివరికి వాస్తవ పరిస్థితిని గమనించి ఎన్నికలలో కూడా పాల్గొనాలనే నిర్ణయానికి వచ్చారు. దీనిని అతివాదుల నుండి మితవాదుల వరకు, వ్యక్తిగత కోపతాపాలుంటే వారితో సహా ఎందరో విమర్శలు చేసి ఉండవచ్చు. అలా అయితే మరో ప్రపంచం, "మరో ప్రపంచం, మరో ప్రపంచం అంటూ", భుగ భుగలాడిన శ్రీశ్రీ కూడా విమర్శకు అతీతుడేం కాలేదు. అయితే ఏమి, నాడు ఇది నా యుగం అని గర్వంగా ప్రకటించుకున్నాడు. నేడు "ఇది గద్దర్ శకం" అని వారి తరపున ప్రకటించడానికి సంశయించాల్సిన పనేంలేదు. విశ్వవిద్యాలయాలు గద్దర్ పేరుతో పరిశోధనలు చేస్తే గద్దర్ శకం అభినందిస్తుంది. ఇవే గద్దరన్నకు నా అరుణారుణ వందనాలు-నివాళులు.

మణిపూర్‌లో మహిళల భారీ నిరసన

యువతిపై సామూహిక అత్యాచారంపై ఆందోళనలు

ఇంఫాల్ : జాతి హింసతో అట్టుడికిపోతున్న మణిపూర్ ఆందోళనలు మరింత ఉధృతమవుతున్నాయి. మే 3న చురాచంద్‌పూర్‌లో 37 ఏళ్ల మహిళపై జరిగిన సామూహిక అత్యాచారానికి వ్యతిరేకంగా మైతేయి మహిళల బృందం మీరా పైబిస్ శుక్రవారం ఇంఫాల్ లోయలోని ఐదు జిల్లాల్లో నిరసన ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించింది. చురాచంద్‌పూర్‌లోని ఖుముజాంబా లైకైలో దగ్ధమవుతున్న తన ఇంటి నుంచి పారిపోతుండగా కొంతమంది వ్యక్తులు తనపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని, ప్రాణాలతో బయటపడినట్లు బాధితురాలు తెలిపిందని పోలీసులు తెలిపారు. ఆగస్టు 9న బిష్ణుపూర్ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేయగా, ఈ విషయాన్ని విచారణ నిమిత్తం చురాచంద్‌పూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు వారు వివరించారు. ఈ సంఘటనకు నిరసనగా మహిళా టార్చ్ బేరర్లు మీరా పైబిస్ ఇంఫాల్ పశ్చిమ జిల్లాలోని కైసంపత్, ఉరిపోక్, సింగ్‌జమీ ప్రాంతాలలో, అలాగే, ఇంఫాల్ తూర్పు జిల్లాలోని కొంగ్బా, ఖురాయ్‌లలో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. బిష్ణుపూర్, కక్చింగ్, తౌబల్ జిల్లాల్లో కూడా ఇలాంటి నిరసనలు జరిగాయి. చురాచంద్‌పూర్‌లో మహిళపై దుండగులు సామూహిక అత్యాచారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నామని నిరసనకారుడు సిల్వియా అన్నారు. మరో నిరసనకారుడు చింగఖం అబెమ్మా మాట్లాడుతూ 'మే 4న ఇంఫాల్ లోయలో జరిగిన అమానుష ఘటన... అంతకుముందు రోజు చురాచంద్‌పూర్, మోరే, కాంగ్‌పోక్పిలలో పెద్ద ఎత్తున కాల్పులు, దహనానికి ప్రతీకారంగా జరిగింది' అని ఆరోపించారు. 'మయన్మార్ నుంచి సాయుధ మిలిటెంట్లు, చొరబాటుదారులు, పురుషులు మహిళలపై చెప్పలేని నేరాలకు పాల్పడటాన్ని వ్యతిరేకిస్తూ మీరా పైబీ అధ్యక్షురాలు లాంగ్బామ్ మెమ్‌చౌబీ ఈ నిరసనకు పిలుపునిచ్చారు. మే 4న ఇంఫాల్ లోయలో పోరాడుతున్న ఒక వర్గానికి చెందిన ఇద్దరు మహిళలను అవతలి వైపు వర్గానికి చెందిన కొంతమంది పురుషులు వివస్త్రను చేసి ఊరేగించినట్లు ఆరోపించబడిన వీడియో దేశవ్యాప్తంగా ఆగ్రహాన్ని రేకెత్తించింది. మే 3న రాష్ట్రంలో జాతి హింస చెలరేగింది. గత మూడు నెలలుగా కొనసాగుతోంది. 160 మందికి పైగా మరణించారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. మణిపూర్ జనాభాలో మైతేయిలు దాదాపు 53 శాతం ఉన్నారు. వీరు ఇంఫాల్ లోయలో ఎక్కువగా నివసిస్తున్నారు. గిరిజనులు నాగాలు, కుకీలు 40 శాతం కంటే తక్కువగా ఉన్నారు. వీరు కొండ జిల్లాలలో నివసిస్తున్నారు.

నవాబ్ మాలిక్‌కు తాత్కాలిక బెయిల్



న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో మహారాష్ట్ర మాజీ మంత్రి నవాబ్ మాలిక్‌కు సుప్రీంకోర్టు శుక్రవారం రెండు నెలల తాత్కాలిక బెయిల్ మంజూరు చేసింది. కేవలం ఆరోగ్య కారణాల రీత్యానే మాలిక్‌కు బెయిల్ మంజూరు చేస్తున్నట్లు కోర్టు స్పష్టం చేసింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) విచారిస్తున్న కేసులో ఆరోగ్య కారణాల రీత్యా బెయిల్ మంజూరు చేయాలన్న మాలిక్ పిటిషన్‌ను తిరస్కరిస్తూ బాంబే హైకోర్టు జులై 13న ఉత్తర్వులు జారీ చేసింది. దీనిపై మాలిక్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మాలిక్ కిడ్నీ వ్యాధి, ఇతర వ్యాధులతో ఆసుపత్రిలో ఉన్నారని న్యాయమూర్తులు అనిరుద్ధ బోస్, బేల ఎం త్రివేదిలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. 'మేము కచ్చితంగా వైద్య పరిస్థితులపైనే ఆర్డర్ ఇస్తున్నాము. కేసు మెరిట్లలోకి ప్రవేశించలేదు' అని ధర్మాసనం స్పష్టం చేసింది. పరారీలో ఉన్న గ్యాంగ్‌స్టర్ దావూద్ ఇబ్రహీం, అతని సహచరుల కార్యకలాపాలతో సంబంధం ఉన్న కేసులో ఈడీ ఫిబ్రవరి 2022 లో మాలిక్‌ను అరెస్టు చేసింది. అప్పటి నుంచి ఈ నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) నాయకుడు జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. ప్రస్తుతం ముంబైలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తాను దీర్ఘకాలిక మూత్రపిండ వ్యాధితో పాటు అనేక ఇతర వ్యాధులతో కూడా బాధపడుతున్నట్లు పేర్కొంటూ మాలిక్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. మెరిట్‌పై బెయిల్ ఇవ్వాలని కూడా కోరారు. అంతర్జాతీయ ఉగ్రవాది, 1993 ముంబై వరుస బాంబు పేలుళ్లలో కీలక నిందితుడైన దావూద్ ఇబ్రహీం, అతని సహచరులపై చట్టవిరుద్ధ కార్యకలాపాల నివారణ చట్టం (ఉపా) కింద జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దాఖలు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా మాలిక్‌పై ఈడీ కేసు నమోదు చేసింది.

మణిపూర్‌పై చర్చ జరగాలని

మోదీ ప్రభుత్వ వాదన బూటకం

కాంగ్రెస్ నేత జైరాం రమేశ్

న్యూఢిల్లీ : పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో మణిపూర్‌పై చర్చ జరగాలని కోరుతున్నట్లు ప్రభుత్వం చేసిన ప్రకటనను కాంగ్రెస్ శుక్రవారం 'బూటకం'గా అభివర్ణించింది. సమావేశం ముగిసిన తర్వాత 'ఇలాంటి తప్పుడు వాదనలు' చేయడం నరేంద్ర మోదీ పాలన 'ప్రామాణిక కార్యాచరణ విధానం' అని పార్టీ పేర్కొంది. మణిపూర్‌పై చర్చ జరగాలని ప్రభుత్వం కోరుకుంటోందని, రాజకీయ కారణాలతో ప్రతిపక్షాలు అందులో పాల్గొనకపోవడం దురదృష్టకరమని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి వ్యాఖ్యానించిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ఈ విమర్శలు చేసింది. మణిపూర్‌పై చర్చ జరగాలని తాము కోరుతున్నామని మోదీ ప్రభుత్వం చేస్తున్న వాదన పూర్తిగా బూటకమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. 'మణిపూర్‌పై ప్రధాని నోరు విప్పడానికి అవిశ్వాస తీర్మానం అవసరం. 133 నిమిషాల నిడివిగల ప్రసంగంలో ఆయన కేవలం 4 నిమిషాలు కూడా మణిపూర్‌పై మాట్లాడలేదు. 'ఇండియా' కూటమి సభ్యులు వాకౌట్ చేసిన తర్వాత మాత్రమే' అని గతంలో ట్విటర్‌గా పిలిచే ఎక్స్‌లో జైరాం రమేశ్ పేర్కొన్నారు. 'ఇండియా' కూటమి పార్టీలు పరస్పర చర్చల తీర్మానం ఆధారంగా చర్చకు మధ్యేమార్గాన్ని అందించాయి. అయితే ఏదో ఒక సాకుతో అధికార పక్షం దీనిని ముందుకు తీసుకెళ్లలేదు' అని ఆయన తెలిపారు. 'కచ్చితంగా స్పష్టంగా చెప్పాలంటే, ఆగస్టు 3 నుంచి 167వ నిబంధన ప్రకారం తీర్మానం కోసం పరస్పర అంగీకార పాఠాన్ని రూపొందించడానికి బీజేపీ ఫ్లోర్ లీడర్‌లతో కూర్చోవడానికి ప్రతిపక్షాలు సిద్ధంగా ఉన్నాయి. ఇప్పుడు సమావేశం ముగిసిన తర్వాత సంబంధిత మంత్రులు ఇలాంటి తప్పుడు వాదనలు చేయడం మోదీ ప్రభుత్వ ప్రామాణిక కార్యాచరణ' అని రాజ్యసభలో కాంగ్రెస్ చీఫ్ విప్ తెలిపారు.

ఈశాన్యంపై రెండు నిమిషాలే ఎందుకు మాట్లాడారు?

ప్రధాని మోదీని ప్రశ్నించిన కాంగ్రెస్

ఇంఫాల్/గువహటి : పార్లమెంటులో అవిశ్వాస తీర్మానం సందర్భంగా రెండు గంటలకు పైగా సుదీర్ఘ ప్రసంగం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ ఈశాన్య రాష్ట్రాలపై కేవలం రెండు నిమిషాలు మాత్రమే ఎందుకు మాట్లాడారని కాంగ్రెస్ మణిపూర్ విభాగం శుక్రవారం ప్రశ్నించింది. గతంలో ట్విటర్‌గా పిలిచే ఎక్స్‌లో ప్రధాని ముందు మూడు ప్రశ్నలను సంధిస్తూ, పార్టీ రాష్ట్ర విభాగం సీనియర్ అధికార ప్రతినిధి నింగోంబమ్ బుపెండా మైతేయి కూడా గురువారం ప్రసంగంలో మణిపూర్ ప్రాదేశిక సమగ్రతపై ప్రధాని ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. మణిపూర్‌కు ఎప్పుడు వస్తారన్నది ఆయన మూడో ప్రశ్న. ఎక్స్‌పై ఆయన తన పోస్ట్‌లో బుపెండా మైతేయి ఇలా పేర్కొన్నారు. 'ప్రియమైన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, 1. మణిపూర్‌పై లోక్‌సభలో నిన్న మీరు చేసిన ప్రసంగంలో 2 గంటల 12 నిమిషాల్లో 3 నిమిషాలే ఎందుకు మాట్లాడారు. 2. లోక్‌సభలో మణిపూర్ ప్రాదేశిక సమగ్రతపై మీరు ఎందుకు మౌనంగా ఉండాలని ఎంచుకున్నారు? 3. మీరు మణిపూర్‌కి ఎప్పుడు వస్తున్నారు?' అని ఆయన ప్రశ్నించారు. లోక్‌సభలో కాంగ్రెస్ ఉప నేత గౌరవ్ గొగోయ్ గురువారం మాట్లాడుతూ ప్రధాని రెండు గంటలపాటు మాట్లాడారని, మణిపూర్‌పై మాట్లాడకుండా, అక్కడి ప్రజల బాధలను పంచుకోవడానికి బదులు పాతికేళ్ల పార్టీని ఎక్కువగా విమర్శించారని అన్నారు. మణిపూర్ జాతి కలహాలపై ప్రధానమంత్రి 'నిశ్శబ్దానికి' ముగింపు పలికేందుకు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టినట్లు ప్రతిపక్ష కూటమి 'ఇండియా' తెలిపింది. మోదీ ప్రత్యుత్తరం ఇస్తున్న సమయంలో ప్రతిపక్ష ఎంపీలు లోక్‌సభ నుంచి వాకౌట్ చేశారు. ఆయన ప్రసంగం మొదటి 90 నిమిషాలలో మణిపూర్ గురించి ప్రస్తావించలేదని ఆరోపించారు. ఇదిలాఉండగా, ప్రధానమంత్రి, బీజేపీ ఈశాన్య ఓట్లు మాత్రమే కావాలని కోరుకుంటున్నారని, అయితే సంక్షోభ సమయాల్లో ఈ ప్రాంతాన్ని సందర్శించడానికి ఎప్పుడూ ఇబ్బంది పడలేదని గువహటిలో తృణమూల్ కాంగ్రెస్ అసోం విభాగం ఆరోపించింది. 'తొమ్మిదేళ్లలో తాను 96 సార్లు ఈశాన్య రాష్ట్రానికి తాను (మోదీ) వచ్చానని మోదీ అన్నారు. అయితే సంక్షోభ సమయంలో రాకపోతే దాని వల్ల ఉపయోగం ఏమిటి? అసోం వరదల సమయంలో ఆయన రాలేదు. మణిపూర్ నెలరోజులుగా కాలిపోతోంది. ఆయన రాలేదు. ఏ మంత్రిని పంపించలేదు' అని టీఎంసీ అసోం విభాగం అధ్యక్షుడు రిపున్ బోరా అన్నారు. గురువారం లోక్‌సభలో తన ప్రసంగంలో మణిపూర్‌లో పరిస్థితిని ఇతర రాష్ట్రాలతో పోల్చడం ద్వారా మోదీ పరిస్థితి తీవ్రతను 'పలచన' చేశారని బోరా నొక్కి చెప్పారు. 'తమ వద్ద డబ్బు ఉందని, ఓట్లను కొనుగోలు చేయవచ్చని బీజేపీ భావించింది. శాశ్వత పరిష్కారం కనుగొనడంలో వారు ఏమాత్రం సీరియస్‌గా లేరు. మణిపూర్ ప్రజల మనోభావాలను కించపరిచారు. ప్రధాన మంత్రి ఉదాసీనత, బాధ్యతారహిత ప్రతిస్పందనను మేము ఖండిస్తున్నాము' అని మాజీ రాజ్యసభ సభ్యుడు అన్నారు. షెడ్యూల్డ్ తెగ (ఎస్టీ) హోదా కోసం మైతేయి వర్గం డిమాండ్‌కు వ్యతిరేకంగా కొండ జిల్లాల్లో 'గిరిజన సంఘీభావ యాత్ర' నిర్వహించిన తర్వాత మే 3న మణిపూర్‌లో జాతి హింస చెలరేగింది. గత మూడు నెలలుగా కలహాలు కొనసాగుతున్నాయి. 160 మందికి పైగా మరణించగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు.

'ఆయుష్మాన్ భారత్'లో అవకతవకలు

1.6 లక్షల క్లెయిమ్‌లపై చర్యలు: కేంద్రం

న్యూఢిల్లీ: ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీ-పీఎంజేఏవై) పథకంలో అవకతవకలకు సంబంధించి ఆయా రాష్ట్ర ఆరోగ్య సంస్థలు ఆగస్టు 5 వరకు రూ. 287 కోట్ల విలువైన 1.6 లక్షల క్లెయిమ్‌లపై తగిన చర్యలు తీసుకున్నట్లు కేంద్రప్రభుత్వం శుక్రవారం పార్లమెంటుకు తెలిపింది. జాతీయ ఆరోగ్య అథారిటీ (ఎన్‌హెచ్‌ఏ) లేదా రాష్ట్ర ఆరోగ్య అథారిటీ జారీ చేసిన మార్గదర్శకాలకు విరుద్ధంగా వ్యవహరించిన 210 ఆసుపత్రులను జాబితా నుంచి తొలగించామని, 188 ఆసుపత్రులను సస్పెండ్ చేయడం జరిగిందని లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానమిస్తూ కేంద్ర ఆరోగ్య మంత్రి మన్సుఖ్ మాండవియా వెల్లడించారు. రూ.20.71 కోట్లు పెనాల్టీ విధించామని, అందులో రూ.9.5 కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు. ఏబీ-పీఎంజేఏవైలో మోసాలను, దుర్వినియోగాన్ని గుర్తించి అరికట్టడం వంటి ప్రాథమిక బాధ్యతతో ఎన్‌హెచ్‌ఏ నేషనల్ యాంటీ-ఫ్రాడ్ యూనిట్ (ఎన్ఏఎఫ్‌యూ)ని ఏర్పాటు చేసిందని మాండవ్య చెప్పారు. ఈ పథకంలో కేంద్రస్థాయిలో ఎన్ఏఎఫ్‌యూ ఉండగా, రాష్ట్ర స్థాయిలో స్టేట్ యాంటీ-ఫ్రాడ్ యూనిట్లు ఉన్నాయన్నారు. అనుమానాస్పద లావాదేవీలు లేదా మోసాలను గుర్తించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) టెక్నాలజీలను ఎన్‌హెచ్‌ఏ ఉపయోగిస్తుందని మంత్రి తెలిపారు. 12 కోట్ల కుటుంబాలకు ఆరోగ్య బీమా అందించే లక్ష్యంతో ఏబీ-పీఎంజేఏవై పథకం సెప్టెంబర్ 23, 2018న ప్రారంభించబడింది. ఇటీవల ఆయుష్మాన్ భారత్ పథకం గురించి 'కాగ్' తన నివేదికలో షాకింగ్ విషయాలను వెల్లడించింది. ఈ పథకంలో, దాదాపు 7.5 లక్షల మంది లబ్దిదారులు ఒకే మొబైల్ నంబర్‌లో నమోదు చేసుకున్నారని తెలిపింది. లోక్‌సభలో సమర్పించిన ఆయుష్మాన్ భారత్ పథకం ఆడిట్ నివేదికలో కాగ్ ఈ సమాచారాన్ని వెల్లడించింది.

ఈసీల నియామక బిల్లు సరైనదే

మేఘవాల్ సమర్థన



న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామక బిల్లును న్యాయ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ శుక్రవారం సమర్థించారు. కొత్త బిల్లులో కేబినెట్ కార్యదర్శి నేతృత్వ కమిటీని ప్రతిపాదించారు. ఐదుగురిని అది ఎంపిక చేస్తుంది. ఆపై ప్రధాని నేతృత్వ సెలక్షన్ కమిటీ చూసుకుంటుంది. ఇందులో తప్పేమిటని ఆయన ప్రశ్నించారు. ఎన్నికల ప్యానల్ సభ్యుల నియామక పద్ధతి గురించి ప్రస్తుత చట్టం ఏమీ లేదని, సెలక్షన్ కమిటీ లేదు కాబట్టి సీజేఐను పక్కకు పెట్టే ప్రశ్నేలేదన్నారు. పార్లమెంట్ దగ్గర విలేకరులతో మాట్లాడిన మేఘవాల్ కొత్త చట్టాన్ని సమర్థిస్తూ సీజేఐ ఏ కమిటీలో ఉన్నారని తొలగించేందుకంటూ ప్రశ్నించారు. 'ఈసీల నియామకానికి చట్టం కోసం పార్లమెంటుకు సుప్రీంకోర్టు మార్చిలో సూచించింది. ఇందుకోసం బిల్లును ఇప్పుడు తెచ్చాం. అప్పటివరకు సెలక్షన్ కమిటీ ప్రతిపాదనలే ప్రధానం' అని మేఘవాల్ అన్నారు. 1952 నుంచి సీఈసీ, ఈసీలను ప్రభుత్వమే నియమిస్తోందని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు కూడా ఇలానే జరిగింది. 1991లో చట్టం రూపొందిందిగానీ అది సర్వీస్, ప్రోత్సాహకాలు, పదవీ కాలానికి సంబంధించింది. కాబట్టి నియామక పద్ధతిపై అందులో ఏమీ లేదు. నియామక ప్రక్రియకు సంబంధించిన అంశం పెండింగ్‌లో ఉందని సుప్రీం చెప్పింది' అని మేఘవాల్ అన్నారు.

అధిర్ రంజన్ 'నీరవ్ మోదీ' వ్యాఖ్యలను సమర్థించిన ఖర్గే



న్యూఢిల్లీ : 'అధిర్ రంజన్ చౌదరిని అత్యంత అన్యాయంగా సస్పెండ్ చేశారు. ఆయన 'నీరవ్ మోదీ' అని అన్నారు. 'నిరవ్' అంటే 'శాంత్, నిశ్శబ్దం'. 'నీరవ్ మోదీ' అని చెప్పినందుకు మీరు (సభ్యుడిని) సస్పెండ్ చేస్తున్నారు' అని ఖర్గే లోక్‌సభలో అన్నారు. చర్చ సందర్భంగా కొన్ని వ్యాఖ్యలు చేశారు. '(ఒక వ్యాఖ్య) అన్‌పార్లమెంటరీ, ఎవరినైనా బాధపెడితే, ఆ సమయంలో మీరు దానిని అన్‌పార్లమెంటరీ అని, ఉపయోగించడం సరైనది కాదని చెప్పవచ్చు' అని ఆయన తెలిపారు. ఇతర సభలో ఇది జరిగిందని చైర్మన్ జగదీప్ ధన్‌కర్ చెప్పినప్పటికీ ఖర్గే మాట్లాడుతూనే ఉన్నారు. 'భారత ఉప రాష్ట్రపతిగా, ఈ సభకు చైర్మన్‌గా నేను మిమ్మల్ని వేడుకుంటున్నాను. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి. ఒకరిని ఇలా సస్పెండ్ చేయకూడదు' అని ఖర్గే అన్నారు. చౌదరి పబ్లిక్ అకౌంట్స్ కమిటీ, బిజినెస్ అడ్వైజరీ కమిటీ, సీబీఐ డైరెక్టర్, సీవీసీ ఎంపిక ప్యానెల్‌లలో కూడా భాగం.

ఈ సస్పెన్షన్‌తో ఆయనను ఈ ప్యానెళ్ల నుంచి తొలగిస్తారు. ఇది మంచిది కాదు' అని ఖర్గే అన్నారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి వి.మురళీధరన్ మాట్లాడుతూ 'ఈ సభ సంప్రదాయం ఏమిటంటే, ఇతర సభల ప్రవర్తన గురించి ఈ సభలో అస్సలు చర్చించలేదు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు చేసిన వ్యాఖ్యలను పరిశీలించి, తొలగించాలి' అని అన్నారు. సభా నాయకుడు పీయూష్ గోయల్ కూడా ఇదే డిమాండ్ చేశారు.

బలపడుతున్న కాంగ్రెస్

మోదీ విమర్శలే సంకేతం: రౌత్

ముంబై : అవిశ్వాస తీర్మానంపై ప్రత్యుత్తరం ఇచ్చిన సందర్భంగా కాంగ్రెస్‌పై ప్రధాని నరేంద్ర మోదీ చేసిన విమర్శల వల్ల పాత పార్టీ మరింత బలపడుతుందని శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్ శుక్రవారం అన్నారు. విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాసంపై చర్చకు సమాధానంగా గురువారం లోక్‌సభలో ప్రధాని మోదీ 130 నిమిషాలకు పైగా మాట్లాడారు. ప్రధానికి 'కాంగ్రెస్-ఫోబియా' పట్టుకుందని ఆయన తన ప్రసంగం పొడవునా పార్టీని విమర్శించారని కాంగ్రెస్ ఆ తర్వాత ప్రధానిపై విరుచుకుపడింది. ఇక్కడ విలేకరులతో రౌత్ మాట్లాడుతూ 'ప్రధాని రెండుసార్లు (ప్రధానిగా) గెలిచినప్పటికీ కాంగ్రెస్ ఇప్పటికీ అతని గుండె, మెదడులో ఉంది. రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఒక సవాలు విసిరింది. పార్టీ అభివృద్ధి చెందుతోంది' అని అన్నారు. మోదీని ప్రస్తావిస్తూ, 'మీరు పదేళ్లు అధికారంలో ఉన్నారు.

కాంగ్రెస్‌ను మరచి మీ పని గురించి మాట్లాడండి' అని అన్నారు. ప్రధాని పార్లమెంటుకు వచ్చి మణిపూర్ సమస్యపై ప్రకటన ఇవ్వాలని, అక్కడ శాంతిని నెలకొల్పేందుకు ప్రభుత్వం ఏం చేస్తోందనే దానిపై అవిశ్వాస తీర్మానం పెట్టామని రౌత్ తెలిపారు. ప్రశ్నలకు రౌత్ సమాధానమిస్తూ, 'ఫ్లయింగ్ కిస్' వివాదాన్ని 'మొహబ్బత్ కి దుకాన్' లోని అంశాలలో ఒకటని చెప్పాడు. 'అంగీకరించు లేదా చేయవద్దు. ఇది ప్రేమకు చిహ్నం. కోపం ఎందుకు వస్తుంది? ఎందుకంటే మీరు ప్రేమ, శాంతి సందేశాన్ని ఇవ్వలేరు' అని శివసేన (యూబీటీ) రాజ్యసభ ఎంపీ అన్నారు.

2024లో లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్ష 'ఇండియా' కూటమి విజయం సాధిస్తుందని, వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల తర్వాత మహారాష్ట్రలో మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని కూడా రౌత్ తెలిపారు.

రిటైరయ్యే సభ్యులకు రాజ్యసభ ఘన వీడ్కోలు

న్యూఢిల్లీ: రాజ్యసభ నుంచి ఈనెల 18వ తేదీకి పదవీ కాలాన్ని పూర్తి చేసుకోనున్న ఐదుగురు సభ్యులకు సభాపతి ధన్కర్ ఘనంగా వీడ్కోలు పలికారు. వారి సేవలను కొనియాడారు. జుగల్‌సిన్హా లోఖండ్‌వాలా, దినేశ్‌చంద్ర జెమల్‌భాయి అనవాడియా (బీజేపీ), సుశ్మితా దేవ్, శాంతా ఛెత్రీ (ఏఐటీసీ), ప్రదీప్ భట్టాచార్య (కాంగ్రెస్) పదవీకాలం పూర్తికానుంది. వాస్తవానికి తొమ్మిది మంది పదవీ కాలం పూర్తి అయింది. అయితే బీజేపీకి చెందిన ఎస్.జైశంకర్, ఏఐటీసీ సభ్యులు సుఖేందు శేఖర్ రే, డెరెక్ ఓ బ్రెయిన్, డోలా సేన్ తిరిగి సభకు ఎన్నికయ్యారు. దీంతో ఐదుగురు మాత్రమే రిటైరవుతున్నారు. శుక్రవారం చైర్మన్ జగదీప్ ధన్కర్ ఆ ఐదుగురి సేవలను కొనియాడారు. మీరు సమర్థంగా పనిచేశారు. మేము మిమ్మల్ని మిస్ అవుతాం అని అన్నారు. పదవీ కాలం ముగిసిన తర్వాత కూడా రాజకీయాల్లో రాణించాలని ఆకాంక్షించారు. రిటైరయ్యే సభ్యులకు వీడ్కోలు పలికేటప్పుడు సభలో ప్రధాని ఉండాలని కాంగ్రెస్ నేత ప్రమోద్ తివారీ అన్నారు. 'ఆయనను రమ్మని చెప్పండి. ఇలా రాజ్యసభను అవమానించవద్దని చెప్పండి' అని ఆయనన్నారు. కాగా, తిరుచీ శివ (డీఎంకే), కె.కేశవరావు (బీఆర్ఎస్), వి.సదాశివన్ (సీపీఎం), నరేన్ దాస్ గుప్తా (ఆప్), పీటీ ఉషా (నామినేటెడ్), రామ్‌నాథ్ ఠాకూర్ (జేడీయూ), రాజీవ్ శుక్లా (కాంగ్రెస్), సస్మిత్ పాత్ర (బీజేడీ) తదితరులు తమ సహచరులకు రిటైర్మెంట్ తర్వాత మంచి జీవితాన్ని ఆకాంక్షిస్తూ వీడ్కోలు పలికారు. పదవీ కాలాన్ని పూర్తిచేసుకోబోయే సభ్యులు మాట్లాడుతూ తమ తమ పార్టీ నేతలకు, సహకరించిన సహచరులకు కృతజ్ఞతలు తెలిపారు. తాము చేసిన పనిని, గడిపిన సభ సమయాన్ని, పోరాడిన అంశాలను గుర్తుచేసుకున్నారు. మణిపూర్ అంశంపై తీర్మానం వస్తుందని ఆశించి భంగపడినట్లు ప్రదీప్ భట్టాచార్య (కాంగ్రెస్) తెలిపారు.

పాఠశాల సమీపంలో గ్యాస్ లీక్

24మంది విద్యార్థులకు అస్వస్థత

న్యూఢిల్లీ: ఢిల్లీలో శుక్రవారం గ్యాస్ లీకవడంతో 24 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. నరైనా ప్రాంతంలో గల మునిసిపల్ పాఠశాలకు సమీపంలో గ్యాస్ లీకైనట్లు అధికారులు తెలిపారు. అస్వస్థతకు గురైన 19 మంది విద్యార్థులను రామ్‌మనోహర్ లోహియా ఆసుపత్రికి తరలించగా, మిగిలిన తొమ్మిది మందిని ఆచార్య శ్రీ భిక్షు ఆసుపత్రికి పంపినట్లు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ (ఎంసీడీ) సీనియర్ అధికారి పీటీఐకి తెలిపారు. 'పాఠశాల సమీపంలో గ్యాస్ లీక్ ఘటన కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. అయితే విద్యార్థులందరూ క్షేమంగా ఉన్నారు. వారిని రెండు ఆసుపత్రులలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు'అని అధికారి చెప్పారు. నగర పాలక ఆరోగ్య శాఖ అధికారులు రెండు ఆసుపత్రులకు, పాఠశాలకు కూడా వెళ్లారని తెలిపారు. కాగా పాఠశాల సమీపంలోని రైల్వే ట్రాక్స్ వద్ద గ్యాస్ లీకు ఘటన జరిగినట్లు ఎంసీడీ ఓ ప్రకటనలో తెలిపింది. ఎంసీడీ ఆరోగ్య విభాగ వైద్యుల బృందం , విద్యాశాఖ అధికారులు కూడా ఆస్పత్రిని సందర్శించి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొంది. ఇందర్‌పురిలోని నిగమ్ ప్రతిభ విద్యాలయ వద్ద కొంతమంది విద్యార్థులు అస్వస్థతకు గురై వాంతులు చేసుకున్నట్లు తమకు ఫోన్ కాల్ వచ్చినట్లు తెలిపారు. ఇప్పటివరకు 24మంది విద్యార్థులను ఆస్పత్రికి తరలించినట్లు డీసీపీ (వెస్ట్) విచిత్రవీర్ వెల్లడించారు. ఈ ఘటనకు కారణమేమిటనే దానిపై దర్యాప్తు జరుపుతామని ఆయన చెప్పారు.

స్వల్పంగా తగ్గిన బంగారం, వెండి ధరలు

న్యూఢిల్లీ : దేశవ్యాపంగా బంగారం, వెండి ధరలు స్వల్పంగా తగ్గాయి. దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం 10 గ్రాములకు రూ.120 తగ్గి.. రూ.59,680కు చేరిందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ తెలిపింది. క్రితం ట్రేడింగ్‌లో రూ.59,800 వద్ద ముగిసింది. వెండి కూడా స్వల్పంగా ధర తగ్గింది. కిలో వెండి రూ.300 తగ్గి.. రూ.73,000కు చేరింది. ఓవర్సీస్ మార్కెట్‌లో బంగారం ఔన్స్‌కు 1,917 డాలర్లు, వెండి ఔన్స్‌కు 22.72 డాలర్లుగా ఉన్నాయి.

జోరుగా కార్ల విక్రయాలు



న్యూఢిల్లీ : ప్రయాణికుల వాహనాల అమ్మకాలు జులైలో జోరుగా సాగాయి. భారత వాహన తయారీదార్ల సంఘం (సియామ్) వెల్లడించింది. గత నెలలో దేశంలో 3,50,149 కార్ల అమ్మకాలు జరిగాయి. గతేడాది ఇదే సమయం (2022 జులై) లో 3,41,370 వాహనాల విక్రయం జరిగాయని సియామ్ తెలిపింది. గతంతో పోల్చితే ఈ ఏడాది 2.57 శాతం అధికమని సియామ్ గణాంకాలు తెలుపుతున్నాయి. ఇక ద్విచక్ర వాహనాల విక్రయాలు మాత్రం తగ్గాయి. ద్విచక్ర వాహనాల విక్రయాలు 12,82,054. అందులో మోటార్ సైకిళ్ల అమ్మకాలు 8,70,028 నుంచి 8,17,206కు.. స్కూటర్లు 4,79,159 నుంచి 4,28,640కు తగ్గాయని సియామ్ పేర్కొంది. అయితే త్రిచక్ర వాహనాలు మాత్రం 31,324 నుంచి 78.9 శాతం వృద్ధితో 56,034కు పెరిగాయి. మొత్తంగా జులైలో 16,40,77 వాహనాల విక్రయాలు జరిగాయి. జులై 2022లో నమోదైన 17,06,545 అమ్మకాలతో పోలిస్తే ఇవి తక్కువ.

రెండో రోజూ నష్టాల్లో స్టాక్ మార్కెట్ సూచీలు

ముంబై : దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా రెండో రోజూ నష్టాల్లో ముగిశాయి. నగదు లభ్యతను తగ్గించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇంక్రిమెంటల్ సీఆర్ఆర్‌ను 10 శాతానికి చేర్చడం, ద్రవ్యోల్బణ అంచనాలు పెంచడం వంటి చర్యలు నష్టానికి కారణమయ్యాయని మార్కెట్ వర్గాలు తెలిపాయి. ప్రధానంగా ఫైనాన్షియల్ స్టాక్స్ అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. మరోవైపు అమెరికాలో ద్రవ్యోల్బణం మళ్లీ పెరగడంతో ఈ రోజు ఆసియా మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపింది. మొత్తం మీద ఈ వారంతంలో మార్కెట్ సూచీలు నష్టపోయాయి. ఉదయం 65,727.80 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమైన సెన్సెక్స్ కాసేపటికి నష్టాలను చవిచూసింది. శుక్రవారం అంతా అదే ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 65,274.61 కనిష్టాన్ని తాకిన సూచీ చివరికి 365.53 పాయింట్ల నష్టంతో 65,322.65 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా 114.80 పాయింట్లు కోల్పోయి.. 19,428.30 పాయింట్ల వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ రూ.82.87గా ఉంది.

లాభపడిన షేర్లు : హెచ్‌సీఎల్‌టెక్, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, టైటాన్, రిలయెన్స్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు, పీఎస్‌యూ బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి.

నష్టపోయిన షేర్లు : ఇండస్ ఇండ్ బ్యాంక్, ఎన్టీపీసీ, సన్ ఫార్మా, ఏషియన్ పెయింట్స్, హిందుస్థాన్ యూనిలీవర్, ఎఫ్ఎంసీజీ బ్యాంక్ షేర్లు నష్టపోయాయి.

రూ.1,498 కోట్లను సమీకరించనున్న అదానీ గ్రూప్

విశాలాంధ్ర బిజినెస్



న్యూఢిల్లీ : పోర్ట్స్ టు పవర్ సమ్మేళనంలో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 10,000 కోట్లను సమీకరించాలనే లక్ష్యంలో భాగంగా స్థానిక కరెన్సీ బాండ్ల ద్వారా ఒక్కొక్కటి రూ. 1,498 కోట్లను సమీకరించేందుకు మర్చంట్ బ్యాంకర్లతో అదానీ గ్రూప్‌లోని రెండు యూనిట్లు చర్చలు జరుపుతున్నాయని అదానీ గ్రూప్‌కు చెందిన అధికారి ఒకరు తెలిపారు. జనవరిలో అమెరికాకు చెందిన షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదిక విడుదలైన తర్వాత అదానీ గ్రూప్ సంస్థలలో ఏర్పడిన ప్రతిష్టంభన నుంచి కోలుకోనే క్రమంలో ప్రస్తుతం సమీకరణ సంస్థ పూర్వపు స్థితికి చేరుకునేందుకు దోహదపడుతోంది. హిండెన్‌బర్గ్ ఆరోపణలను అదానీ గ్రూప్ ఖండించిన విషయం తెలిసిందే. అదానీ ఎయిర్‌పోర్ట్ హెూల్డింగ్స్, అదానీ పోర్ట్స్ ముందుగా మార్కెట్‌లోకి ప్రవేశించవచ్చని, దాదాపు రూ.1,000-1,500 కోట్ల ఆఫర్‌లను అందించవచ్చని బ్యాంకర్లు తెలిపారు. సెప్టెంబర్‌లో ఐదేళ్ల వరకు బాండ్లను జారీ చేయాలని వారు చూస్తున్నారని సమాచారం.

ప్రధాని ఇలాగేనా మాట్లాడేది?

మణిపూర్ కాలిపోతుంటే జోకులు వేస్తూ నవ్వుతారా!

ఆ రాష్ట్రం గురించి మాట్లాడింది రెండు నిమిషాలేగా...

లోక్‌సభలో మోదీ ప్రసంగంపై రాహుల్ అసహనం

న్యూదిల్లీ: మణిపూర్ కాలిపోతుంటే పార్లమెంటులో ప్రధాని మోదీ నవ్వులు పూయిస్తూ జోకులు వేయడం ఏమిటని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అసహనం వ్యక్తంచేశారు. తన స్థాయిని మరిచి ప్రధాని వ్యవహరించారని, దేశానికి ప్రతినిధిగా ఉన్న వ్యక్తి ఇలా మాట్లాడటం తగదని అన్నారు. విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానానికి లోక్‌సభలో సమాధానం చెప్పే క్రమంలో గురువారం విపక్షాలపై మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విమర్శలు చేస్తూ, వ్యంగ్యంగా మాట్లాడారు. ఆయన తీరును రాహుల్ తీవ్రంగా ఖండించారు. ప్రధాని ఎలా ఉండాలనేది మోదీ తప్పుగా అన్వయించుకున్నారని వ్యాఖ్యానించారు. మణిపూర్ కాలిపోతూనే ఉండాలని ప్రధాని కోరుకుంటున్నట్లు ఉన్నారు లేకపోతే హింసను ఆపేందుకు ఆయనకు చాలా అవకాశాలు ఉంటాని ఏఐసీసీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాహుల్ అన్నారు. లోక్‌సభలో ప్రధాని తీరును తీవ్రస్థాయిలో తప్పుపట్టారు. రెండు గంటలకుపైగా సాగిన ప్రసంగంలో మణిపూర్ గురించి మాట్లాడినది రెండు నిమిషాలేనన్నారు. నాలుగు నెలలుగా మణిపూర్‌లో అల్లర్లు, అత్యాచారాలు, హత్యలు జరుగుతుంటే ప్రధాని నవ్వుతూ, జోకులు వేశారు. ఇంతలా దిగజారి మాట్లాడిన ప్రధానిని చూడలేదు.

ప్రధానిగా దేశానికి ప్రాతినిధ్యం వహించే వ్యక్తి ఓ రాజకీయ నాయకుడిగా మాట్లాడటం తగదు' అని రాహుల్ వ్యాఖ్యానించారు. మోదీ, అమిత్‌షా వ్యాఖ్యలు మణిపూర్‌లో భారతమాతను ఖూనీ చేసేలా ఉన్నాయన్నవి డొల్లవ్యాఖ్యలు కావు, ఆధారాలు లేకుండా మాట్లాడలేదని అన్నారు. తన 19ఏళ్ల రాజకీయ జీవితంలో మణిపూర్‌లో రెండు వర్గాల మధ్య ఉన్న పరిస్థితులు తరహా ఎన్నడూ చూడలేదు, వినలేదని చెప్పారు. మణిపూర్‌లో హిందుస్తాన్‌ను బీజేపీ ఖూనీ చేసిందని ఉద్ఘాటించారు. మణిపూర్‌కు వెళ్లినప్పుడు మయితేల వద్దకు వెళ్లాలనుకున్నప్పుడు ఆ వర్గీయులు స్వాగతించారుగానీ కుకీ వర్గానికి చెందిన వారు భద్రతా సిబ్బందిలో ఉండకూడదని, ఉంటే చంపేస్తామని షరతు పెట్టారని, అటు కుకీలు కూడా ఇలానే చెప్పారని, ఇలాంటి పరిస్థితి తామెప్పుడు చూడలేదని కేంద్ర భద్రతా సిబ్బంది తనలో చెప్పారని రాహుల్ తెలిపారు. 'భారతమాత అనే పదాన్ని పార్లమెంటు రికార్డుల నుంచి తొలగించడం బహుశ ఇదే మొదటిసారి. ఇది అవమానకరం. ఆక్షేపణీయం. మణిపూర్‌లో పరిస్థితులను చూశాను కాబట్టే ఆ వ్యాఖ్యలు చేశాను. అందులో తప్పేమిటి? ప్రజలంతా కలిసికట్టుగా, సామరస్యంగా, ప్రేమానురాగాలతో బతకడమే భారతదేశ ఆలోచన. కానీ మణిపూర్‌లో అది లేదు. అది రాష్ట్రంగా వ్యవహరించడం లేదు. అక్కడి మంటలను అర్పడానికి మోదీ చర్యలు తీసుకోవడం లేదు. అదలా కాలిపోవాలనే కోరుకుంటున్నారు. సైన్యంపై మాకు పూర్తి నమ్మకం ఉంది. వారు రంగంలోకి దిగి ఈ హింసను అంతం చేయగలరు. కానీ ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. ప్రధాని మణిపూర్‌కు వెళ్లకపోవడానికి కారణాలు ఉన్నాయి. వాటి గురించి నేను బహిరంగంగా చెప్పాలనుకోవడం లేదు. కానీ ఆ రాష్ట్రాన్ని, అక్కడి మహిళలను లోక్‌సభలో ప్రధాని అవమానించారు. చాలా తక్కువ చేసి మాట్లాడారు. ఓ వ్యక్తి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రజాప్రతినిధిగా ఉండాలేగానీ ఓ రాజకీయ పార్టీ నేతగా కాదు. రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలి. కానీ మోదీ వైఖరి అందుకు పూర్తి భిన్నంగా ఉంది. రెండు గంటల పాటు కాంగ్రెస్ గురించి, విపక్షాల గురించి మాట్లాడుతూ, విమర్శలు చేస్తూ, జోకులు వేస్తూ ఆయన భారత ప్రధాని స్థాయికి ఎంతమాత్రం న్యాయం చేయలేదు. కాంగ్రెస్, బీజేపీ ప్రధానులు గతంలో చూశా. వాజ్‌పేయి, దేవెగౌడ వంటివారిని చూశా. ప్రధాని ఎలా ఉండాలనేది మోదీ తప్పుగా అర్థం చేసుకున్నారు' అని రాహుల్ వ్యాఖ్యానించారు.

స్వాతంత్ర్య వేడుకలకు ఏపీ నుంచి ఇద్దరికి ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మంగళవారం జరగనున్న 76 వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎర్రకోటపై జాతీయ జెండా ఎగురవేసే వేడుకలకు ప్రత్యేక ఆహ్వానితులుగా ఏపీకి చెందిన ఇద్దరికి అవకాశం దక్కింది. జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ ప్రసంగం వినడానికి దేశవ్యాప్తంగా 1800 మంది ప్రత్యేక వ్యక్తులకు కేంద్ర ప్రభుత్వం ఆహ్వానాలు పంపింది. ఉత్తర కోస్తా ప్రాంతంలోని విజయనగరం జిల్లా చీపురుపల్లి మండలం రామలింగాపురం గ్రామానికి చెందిన యండవ సీత కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ నుంచి ప్రత్యేక ఆహ్వానం అందుకున్నారు. శ్రీకాకుళం జిల్లా పొందూరు పట్టణానికి చెందిన నేత కళాకారుడు బల్ల భద్రయ్యకు కేంద్ర ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ ఆహ్వానం పంపింది. వీరిద్దరూ తమకు అరుదైన అవకాశాన్ని కల్పించిన ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలియజేశారు.

రాజ్యసభ నుంచి ఆప్ ఎంపీ చద్దా సస్పెన్షన్

న్యూదిల్లీ: 'నియమ ఉల్లంఘన, దుష్ప్రవర్తన, ధిక్కార ప్రవర్తన' కారణంగా ఆప్ ఎంపీ రాఘవ్ చద్దాను శుక్రవారం రాజ్యసభ నుంచి సస్పెండ్ చేశారు. ప్రివిలేజెస్ కమిటీ నివేదిక పెండింగ్‌లో ఉంది. దిల్లీలోని జాతీయ రాజధాని ప్రాంతం (సవరణ) బిల్లు-2023 కోసం ప్రతిపాదిత ఎంపిక కమిటీలో వారి అనుమతి లేకుండా రాజ్యసభలోని కొంతమంది సభ్యుల పేర్లను చేర్చినందుకు ఆప్ నాయకుడిపై చర్య తీసుకోవాలని కోరుతూ సభా నాయకుడు పీయూష్ గోయల్ చేసిన తీర్మానాన్ని అనుసరించి ఆయన సస్పెన్షన్ జరిగింది. మూజువాణి ఓటుతో తీర్మానం ఆమోదించబడింది.

జగన్ సర్కార్‌కు మరో ఝలక్ !

మార్గదర్శికి హైకోర్టులో ఊరట

చిట్స్ రిజిస్ట్రార్ బహిరంగ నోటీసుపై స్టే

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మార్గదర్శిని వెంటాడుతున్న జగన్ సర్కార్‌కు ఏపీ హైకోర్టులో మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. మార్గదర్శికి చిట్స్ రిజిస్ట్రార్ ఇచ్చిన బహిరంగ నోటీసుపై హైకోర్టు స్టే ఇచ్చింది. చందాదారుల నుంచి అభ్యంతరాలు కోరుతూ చిట్స్ రిజిస్ట్రార్ ఇచ్చిన బహిరంగ నోటీసును హైకోర్టు నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. చిట్స్ రిజిస్ట్రార్ నోటీసు ఆధారంగా తీసుకోబోయే తదుపరి చర్యలను హైకోర్టు నిలిపివేస్తూ ఆదేశాలు ఇచ్చింది. చందాదారులు ఇప్పటికే వేసిన పిటిషన్లపై మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చామని హైకోర్టు పేర్కొంది. చందాదారుల పిటిషన్లు, మార్గదర్శి పిటిషన్లు కలిపి విచారించాల్సిన అవసరం ఉందని హైకోర్టు తెలిపింది. చందాదారుల వ్యాజ్యాలు, మార్గదర్శి వ్యాజ్యాలు ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్నాయని హైకోర్టు గుర్తు చేసింది.కొద్దిరోజుల క్రితం మార్గదర్శి చిట్స్‌కి చెందిన కొన్ని గ్రూపులను ఏపీ ప్రభుత్వం నిలిపివేసింది. ఎలాంటి ఫిర్యాదులు లేని మార్గదర్శిపై ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా చిట్లను నిలిపివేయటంపై మార్గదర్శి హైకోర్టును ఆశ్రయించింది. దాదాపు ఆరు దశాబ్దాల చరిత్ర కల్గిన మార్గదర్శిలో లక్షలమంది ఖాతాదారు లున్నారని, వారిలో ఏ ఒక్కరూ ఒక్క ఫిర్యాదు కూడా చేయకపోయినప్పటికీ సంస్థను గత కొంతకాలంగా రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందులు పెడుతోందని న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. చివరకు కోర్టు ఆదేశాలు కూడా ప్రభుత్వం పట్టించుకోకుండా మార్గదర్శి యాజమాన్యాన్ని వేధింపులకు గురి చేస్తున్నదని తెలిపారు. రెండుపక్షాల వాదనలు విన్న హైకోర్టు పై మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

గ్రామీణ శ్రామికుల సమస్యలపై దృష్టి

గుంటూరు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలో విల్సన్, శేఖర్ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-గుంటూరు: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పేదలకు భూమి దక్కాలంటే కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులు అమలు జరగాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం(బీకేఎంయూ) అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం గుంటూరు జిల్లా 23వ మహాసభ మల్లయ్యలింగంభవన్‌లోని వీఎస్‌కే హాలులో శుక్రవారం జరిగింది. దేవుని దయ, తుంగా బాలస్వామి అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన జల్లి విల్సన్ మాట్లాడుతూ దళిత, గిరిజన, మైనారిటీ తదితర ఆహార ఉత్పత్తి చేసే శ్రామికులకు సామాజిక న్యాయం కావాలని గళమెత్తిన ఏకైక సంఘం వ్యవసాయ కార్మిక సంఘమని చెప్పారు. దున్నేవాడిదే భూమి అనే నినాదంతో లక్షలాది మంది పేదలకు సాగుభూములు ఇప్పించిన ఘనత వ్యవసాయ కార్మిక సంఘానికే దక్కుతుందన్నారు. అనేక పోరాటాలు

చేసి పేదలకు ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు, పెన్షన్లు అందించిందని గుర్తుచేశారు. ఆనాడు అనేక పోరాటాలు చేసి భూ సంస్కరణ చట్టాన్ని సాధించుకున్నామనీ, నేటి పాలకులు ఆ చట్టాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేడు రాష్ట్రంలో అమలు చేస్తున్న నవరత్నాలు వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్ల నుంచి పుట్టినవే అని చెప్పారు. జగనన్న కాలనీల పేరుతో గ్రామీణ ప్రాంతాలలో రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న సెంటున్నర స్థలం ఏమాత్రం సరిపోదని కనీసం మూడు సెంట్ల స్థలం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం పోరాటం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గ్రామాలలో పర్యటించి గ్రామీణ శ్రామికులు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రతి గ్రామ సచివాలయాన్ని సందర్శిం చాల న్నారు. రైతులు, చేతివృత్తిదారులను సమన్వయ పరచుకుని గ్రామీణ ఐక్యత సాధించేందుకు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ భూములను అధ్యయనం చేసి ప్రతి పేదవాడికి భూమి దక్కేలా చూడాలన్నారు. బాపట్లలో ఈ నెల 24, 25, 26 తేదీలలో జరుగనున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని విల్సన్ పిలుపునిచ్చారు. ఆవుల శేఖర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో వ్యవసాయ కార్మికులు ఉపాధి కోల్పోయే ప్రమాదం వచ్చిందని, గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ కూలీలు మూడు పూటల తిండి తినే పరిస్థితి లేదని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర జరుగు తోందని, కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీకి కేవలం రూ.60 వేల కోట్లు కేటాయించడమే అందుకు నిదర్శనమన్నారు. కార్మికులు పనిచేసే ప్రదేశాలలో సరైన మౌలిక సదుపాయాలు లేవని, ప్రాథమిక వైద్యం అందుబాటులో లేదని అన్నారు. ఈ నేపథ్యంలో ఉపాధి హామీ పథకాన్ని పరి రక్షించేందుకు వ్యవసాయ కార్మిక సంఘం సిద్ధం కావాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ వ్యవసా యానికి వ్యవసాయ కార్మికులు జీవనాడి వంటి వారని అన్నారు. వ్యవసాయ కార్మికుడికి ఇచ్చే కూలీతో జీవనం గడవడం కష్టంగా ఉందని, పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా వారికి రోజు కూలి రూ.750 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడారు. సంఘం జిల్లా కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు కార్య కలాపాల నివేదిక ప్రవేశపెట్టారు. అనేక తీర్మానాలు ఆమోదించారు. తొలుత సీనియర్ నాయకులు గుర్రంకొండ సత్యానందం వ్యవసాయ కార్మిక సంఘం పతాకాన్ని ఆవిష్కరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మహిళా పక్షపాత ప్రభుత్వం

- అమలాపురంలో పావలా వడ్డీ రుణ మాఫీ కార్యక్రమంలో సీఎం జగన్
- మహిళల బ్యాంకు ఖాతాల్లో రూ.1,353.76 కోట్లు జమ

విశాలాంధ్ర-అమలాపురం: మహిళల అభివృద్ధి, మహిళా సాధికారత ప్రధాన అజెండాగా తమ ప్రభుత్వం మహిళా పక్షపాతంగా పని చేస్తోందని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని బాలయోగి స్టేడియంలో జరిగిన పావలా వడ్డీ రుణ మాఫీ కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత పోలీస్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ ప్రాంతంలో దిగి నేరుగా సభా ప్రాంగణానికి చేరుకుని అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అమలాపురం పేరూరు వై జంక్షన్ వద్ద నుంచి అల్లవరం మండలం గోడిలంక వరకు రూ.17 కోట్లతో విస్తరించనున్న రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జీ) ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను తిలకించారు. 'వైఎస్సార్ సున్నా వడ్డీ' పథకం కింద 9.48 లక్షల స్వయం సహాయక సంఘాలకు చెందిన 1,05,13,365 మంది అర్హులైన మహిళలకు లబ్ధి చేకూర్చేందుకు వరుసగా నాలుగో సంవత్సరం రూ.1,353.76 కోట్ల మొత్తాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ మన అక్కాచెల్లెళ్లకు సాధికారత కల్పించేందుకు తాము ఐక్యంగా ఉన్నామన్నారు. ఎస్‌హెచ్‌జీలు సకాలంలో రుణాలు చెల్లిస్తే, ప్రభుత్వమే

వారికి వడ్డీ మొత్తాన్ని చెల్లిస్తుందని, ఈ చెల్లింపు నేరుగా ఎస్‌హెచ్‌జీల బ్యాంకు ఖాతాల్లోకి వెళుతుందన్నారు. దీనిలో జాప్యాలు లేదా మధ్యవర్తులు లేరని నిర్ధారిస్తుందని తెలిపారు. నేడు ప్రభుత్వం ఈ పథకానికి రూ.1,353.76 కోట్ల మొత్తాన్ని జోడించడం ద్వారా ఇప్పటివరకు ప్రభుత్వం వెచ్చించిన మొత్తం రూ.4,969.05 కోట్లకు చేరిందన్నారు. ఇది మహిళలకు సాధికారత కల్పించడంలో లోతైన, కొనసాగుతున్న నిబద్ధతను ప్రదర్శిస్తుందన్నారు. బ్యాంకులతో చర్చల ద్వారా వడ్డీ రేట్లను విజయవంతంగా తగ్గించడం ప్రభుత్వం సాధించిన అద్భుతమైన విజయాలలో ఒకటని అన్నారు. దీంతో ఎస్‌హెచ్‌జీలపై ఆర్థిక భారాన్ని రూ.1,224 కోట్ల మేర తగ్గించిందని, మహిళలకు స్థిరమైన ఆదాయాలు పొందడానికి పునాదిని సృష్టించిందని ఆయన చెప్పారు. ఈ రోజు వరకు 16,44,029 మంది మహిళలు ఈ ప్రయత్నాల ప్రతిఫలాన్ని పొందారని, దీనివలన అదనపు నెలవారీ ఆదాయం రూ.7 వేల నుంచి రూ.10 వేలు అని తెలిపారు. గత ప్రభుత్వం రుణ మాఫీ వాగ్దానాలను నిలబెట్టుకోవడంలో విఫలమవడంతో మెజారిటీ ఎస్‌హెచ్‌జీలు నిర్వీర్యమయ్యాయని, అయితే వైసీపీ ప్రభుత్వం సకాలంలో తిరిగి చెల్లించేలా చేయడం ద్వారా స్వయం సహాయక సంఘాలకు కొత్త జీవం పోసిందని సీఎం జగన్ చెప్పారు.

చంద్రబాబు, పవన్‌పై ఘాటు విమర్శలు

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌పై తీవ్ర స్థాయిలో సీఎం జగన్ ధ్వజమెత్తారు. 'నారా చరిత్ర-నారీ వ్యతిరేక చరిత్ర' (మహిళా వ్యతిరేక) అని అన్నారు. టీడీపీ పాలనలో ఎస్‌హెచ్‌జీల మహిళలు తీసుకున్న 18.36 శాతం రుణాలు నిరర్థక ఆస్తులుగా (ఎన్‌పీఏలు) గా మారాయని తెలిపారు. దీనికి విరుద్ధంగా ఈ సంఖ్య ప్రస్తుతం 0.3 శాతం వద్ద... చాలా తక్కువగా ఉందని అన్నారు. పుంగనూరులో హింసను ప్రేరేపించినందుకు చంద్రబాబుపై మండి పడ్డారు. చంద్రబాబు తన పర్యటనల్లో ప్రజలను రెచ్చగొడుతున్నారని, అంగళ్లులో పోలీసులపై దాడికి తన అనుచరులను ఉసిగొల్పాడని అన్నారు. అనుమతి నిరాకరించిన తర్వాత కూడా పుంగ నూరులో రాస్తారోకో చేశారని, చంద్రబాబు మార్గ దర్శకత్వంలో అతని మద్దతుదారులు హింసాత్మక చర్యలకు పాల్పడటంతో 47 మంది పోలీసు సిబ్బందికి గాయాలయ్యాయని తెలిపారు. విచారకరంగా ఒక పోలీసు కన్ను కూడా కోల్పోయారని ఆరోపించారు. వలంటీర్లపై చేసిన వ్యాఖ్యలపై జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై మండిపడ్డారు. మీలో ఒకరిగా ఉన్న, మీ ఇంటి నుంచి వచ్చిన వలంటీర్లను ఎలా దూషిస్తారు, అవమానిస్తారని ప్రశ్నించారు. రాష్ట్రంలో మానవ అక్రమ రవాణా, తప్పిపోయిన బాలికలపై పవన్ చేసిన ఆరోపణలను ఖండించారు. 'దిశ' యాప్ ద్వారా 30,369 మంది మహిళలను రక్షించడం ద్వారా, నామినేటెడ్ పోస్టులలో మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా మహిళా సాధికారత ప్రాధాన్యతను తమ ప్రభుత్వం నిరూపించిందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్న అమలాపురం పట్టణానికి మూడు ప్రధాన వంతెనల నిర్మాణానికి రూ.10 కోట్ల నిధులను ముఖ్యమంత్రి మంజూరు చేశారు.

ఉపాధ్యాయుల జీతాల బిల్లు గడువు పొడిగించాలి: ఎస్టీయూ

విశాలాంధ్ర-విజయవాడ: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 60 వేల మంది ఉపాధ్యాయుల జీతాల బిల్లు సమర్పించే గడువును ఈనెల 20వ తేదీ వరకు పొడిగించాలని రాష్ట్ర ఖజానా కార్యాలయం సంచాలకులు ఎన్.మోహన్ రావు, రాష్ట్ర సంయుక్త సంచాలకులు మువ్వా రామలింగంకు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం అమరావతిలోని వారి వారి కార్యాలయాల్లో విడి విడిగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జీవో 117, 47ల ప్రకారం పదోన్నతి, బదిలీ పొందిన దాదాపు 60 వేల మంది ఉపాధ్యాయులకు జూన్, జూలై నెల జీతాలు ఇప్పటివరకు చెల్లించలేదని తెలిపారు. సవరించిన క్యాడర్ స్ట్రెంత్ వివరాలు పూర్తి చేసి కమీషనర్ కార్యాలయంలో సమర్పించామన్నారు. దీనితో పాటు రాష్ట్రవ్యాప్తంగా 679 ఎంఈఓ-2, 74 డివిజనల్ స్థాయి ఉప విద్యాధికారి పోస్టులు కొత్తగా సృష్టించినవి కూడా పాఠశాల విద్య క్యాడర్ స్ట్రెంత్‌లో కలిపి సమర్పిస్తామని తెలిపారు. గత రెండు మాసాలుగా జీతాలు లేక ఉపాధ్యాయులు మానసిక ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. నెలసరి వాయిదాలు, గృహ రుణాలు, వ్యక్తిగత రుణాలు, చెల్లించక పోవడం వల్ల



సంబంధిత బ్యాంకులు పెనాల్టీ సందేశాలు పంపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో జీతాలు చెల్లించలేని ప్రభుత్వమే బ్యాంకుల పెనాల్టీ భరించాలని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. రెండు మాసాల అరియర్ బిల్లు సమర్పించడానికి గడువు ఈ నెల 20 వరకు పెంచాలని, ఎట్టి పరిస్థితులలోనూ ఈ నెలాఖరులోపు పెండింగ్ జీతాలు చెల్లించే ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై అధికారులు స్పందిస్తూ గడువు పెంచే ఆలోచన చేస్తున్నామని, వీలైనంతవరకు ఈ నెలాఖరులోపు పెండింగ్ జీతాలు చెల్లించే ఏర్పాట్లు చెప్పామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.